www.udyamakeratam.com
RNI: TGTEL/25/A0273

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 1 | | సంచిక: 289 | | 9-5-2026 | | శనివారం | | పేజీలు: 8 | | వెల : రూ.5/-



2

## అదుపు తప్పిన శాంతిభద్రతలు

- రాష్ట్రంలో వరుస హత్యలు ఆందోళనకరం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



2

## యువత మత్తుకు దూరంగా ఉండాలి

టాలెంట్ ఉంటేనే ఉద్యోగాలు వస్తాయి

మహిళలకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం

మంత్రి కొండా సురేఖ

# బెంగాల్ రాజకీయాల్లో బీజేపీ శకం




- రాష్ట్ర సీఎంగా సువేందు అధికారి
- శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నిక
- అమిత్ షా సమక్షంలో ఎమ్మెల్యేల భేటీ
- నేడు సీఎంగా సువేందు ప్రమాణ కార్యక్రమం
- ప్రధాని మోడీ, అమిత్ షా, తదితరులు హాజరు

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. రాష్ట్రంలో తొలిసారిగా బీజేపీ ప్రభుత్వం కొలువుదీరబోతోంది. టీఎంసీ కంచు కోటను బద్ధలు కొట్టి, కమల దళాన్ని విజయతీరాలకు చేర్చిన సువేందు అధికారిని బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని బిశ్వ బంగ్లా కన్వెన్షన్ సెంటర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

4

# మైనారిటీల సంక్షేమమే లక్ష్యం



- పాత ఆటోలకు ఉచితంగా ఎలక్ట్రిక్ రెట్రో ఫిట్టింగ్
- 'సర్' పేరిట జరిగే ఓట్ల తొలగింపు కుట్రలను తిప్పికొట్టాలి
- హజ్ యాత్రికుల బస్సులకు సీఎం రేవంత్ పచ్చజెండా

**తెలంగాణ రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమం, వారి సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నాంపల్లిలో హజ్ యాత్రికుల బస్సులను ప్రారంభించిన సీఎం.. మైనారిటీల వాటాను వారికి అందించడంలో వెనకడుగు వేయబోమని హామీ ఇచ్చారు. గత ప్రమాద బాధితులను ఆదుకున్న తీరును గుర్తు చేస్తూ.. ఆటో డ్రైవర్లకు ఉచితంగా ఎలక్ట్రిక్ కిట్లు, విద్యార్థుల కోసం ప్రతి జిల్లా కేంద్రంలో ప్రత్యేక డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. మైనారిటీల ఓట్ల తొలగింపు కుట్రలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి వాటిని తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.**

**హైదరాబాద్, మే 08:** తెలంగాణ రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నాంపల్లిలో హజ్ యాత్రికుల బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ మైనారిటీల వాటాను వారికి అందించడంలో ప్రభుత్వం వెనకడుగు వేయబోదని హామీ ఇచ్చారు.

### బాధిత కుటుంబాలకు అండగా

గత ఏడాది హజ్ యాత్రకు వెళ్లిన సమయంలో జరిగిన బస్సు ప్రమాదంలో 44 మంది మృతి చెందిన ఘటనను సీఎం గుర్తు చేసుకున్నారు. ఆ విపత్కర సమయంలో ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందించి, మృతుల కుటుంబాలకు 5 లక్షల రూపాయల చొప్పున పరిహారం అందించి ఆదుకుందని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వైట్ కాలర్ ఉద్యోగాల కంటే బ్లూ కాలర్ ఉద్యోగాలకు డిమాండ్ ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. అమెరికా కంటే జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయని.. ఈ అవకాశాలను మన యువత అందుకోవాలనే ఉద్దేశంతో ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసి నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

### ఆటో డ్రైవర్లకు ఉచితంగా రెట్రో ఫిట్టింగ్

హైదరాబాద్‌లో వేలాది మంది మైనారిటీ సోదరులు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారని.. వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఒక ప్రతిష్టాత్మక నిర్ణయం తీసుకుందని సీఎం చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఉన్న పాత ఆటోలన్నింటికీ ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేసి, వాటిని ఎలక్ట్రిక్ ఆటోలుగా మారుస్తామని హామీ ఇచ్చారు. దీనివల్ల

మిగతా 2 లో

# విజయ్ అనే నేను..

- ముహూర్తం ఫిక్స్
- రాహుల్‌కు ఆహ్వానం..
- సినీ ప్రముఖులు రాక..!!

తమిళనాడు రాజకీయాల్లో ఒక కొత్త శకం ఆరంభం కాబోతోంది. వెండితెరపై 'దళపతి'గా కోట్లాది మంది నీరాజనాలు అందుకున్న విజయ్, ఇప్పుడు నిజ జీవితంలో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించబోతున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఐదు రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరదించుతూ, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 మంది ఎమ్మెల్యేల మద్దతు విజయ్ పక్షాన చేరింది. అన్నీ కుదిరితే శనివారం విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు.

4





## దేశం గర్వించేలా కొడంగల్ అభివృద్ధి

- ఎడ్యుకేషన్ హబ్ గా మారుస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- 430 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన

02

దేశం మొత్తం తన నియోజకవర్గం కొడంగల్ వైపు చూసేలా అభివృద్ధి చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్ గా మార్చడంతో పాటు కృష్ణా జలాలతో సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు.



## పొంగులేటితో డీజీపీ భేటీ

02

సచివాలయంలో మర్యాదపూర్వక సమావేశం



## థలసేమియా అంటువ్యాధి కాదు

వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా

2

## రిటైర్డ్ ఐపీఎస్ భార్య దారుణ హత్య

- పనిమనిషి కల్పన ఆధ్వర్యంలో నేపాలీ గ్యాంగ్ ఘాతుకం
- నగదు, బంగారం దోచుకెళ్లిన దుండగులు
- నిందితుల కోసం గాలిస్తున్నాం: సీపీ సజ్జనార్

నగరంలోని అత్యంత భద్రత కలిగిన జూబ్లీహిల్స్ ప్రశాసన్ నగర్‌లో ఘోరం జరిగింది. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ సతీమణి తనుజ (55) దారుణ హత్యకు గురయ్యారు. గత ఎనిమిది నెలలుగా ఆ ఇంట్లో పనిమనిషిగా ఉంటున్న నేపాల్‌కు చెందిన కల్పన.. తన ముఠాతో కలిసి ఈ ఘాతుకానికి ఒడిగట్టింది. గురువారం అర్ధరాత్రి సమయంలో నిందితులు ఇంటి వెనుక గేటు గుండా లోపలికి ప్రవేశించి.. తనుజ చేతులు కట్టేసి, నోట్లో బట్టలు కుక్కి ప్రాణాలు తీశారు. హత్య అనంతరం ఇంట్లోని బంగారం, నగదు దోపిడీ చేసి పరారయ్యారు.

2



## మూసీ పునరుజ్జీవనం సామాజిక బాధ్యత

- నగర రూపురేఖలు మార్చడమే ప్రధాన లక్ష్యం
- ప్రజల భాగస్వామ్యంతోనే ప్రాజెక్టు సాకారం
- 2027 డిసెంబర్ నాటికి పనులు పూర్తి కావాలి
- క్యాబినెట్ సబ్ కమిటీ కీలక ఆదేశాలు

2



ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శనివారం
9 మే 2026

# తెలంగాణలో అదుపు తప్పిన శాంతిభద్రతలు

**హైదరాబాద్, మే 08 :** రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో శాంతిభద్రతలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న ఘోరమైన నేరాల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ యంత్రాంగం మొత్తాన్ని రాజకీయ కక్షసాధింపులు, ప్రతిపక్ష నాయకులను వేధించడం కోసమే మళ్లించడం వల్లనే ప్రజల రక్షణ, భద్రత గాలిలో కలిసిపోయిందని విమర్శించారు. శాంతిభద్రతల క్షీణతపై బీఆర్ఎస్ ప్రతినిధి బృందం డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తున్న సమయంలోనే అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే హైదరాబాద్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీఐజీ ర్యాంక్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ భార్య అత్యంత దారుణంగా హత్యకు గురైన వార్త రావడం దిగ్భ్రాంతికరమని పేర్కొన్నారు. అంతేకాకుండా నిన్న రాత్రి సికింద్రాబాద్‌లో నడిరోడ్డుపై ఒక యువకుడిని అతి దారుణంగా కత్తితో పొడిచి చంపిన ఘటన నగరాన్ని ఉలిక్కిపడేలా చేసిందని, ఇది సామాన్య పౌరుల్లో పెరుగుతున్న అభద్రతా భావానికి అద్దం పడుతోందని స్పష్టం చేశారు. నేరాల నివారణ, ప్రజా భద్రతపై దృష్టి పెట్టాల్సిన పోలీస్, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ తీరును విమర్శించే సోషల్ మీడియా గొంతులపై అక్రమ కేసులు బనాయించేందుకు వాడుకుంటోందని ఆరోపించారు. పోలీస్ వ్యవస్థను రాజకీయ కక్షసాధింపు చర్యలకు వాడుకోవడం వల్లనే శాంతిభద్రతలు కుప్పకూలాయని స్పష్టం చేశారు. తెలంగాణలో మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలు భారీగా పెరిగినట్లు తాజా ఎన్సీఆర్బీ నివేదికలు చెబుతున్నాయని, ఇది ప్రస్తుత ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని కేటీఆర్ గుర్తుచేశారు. హోం శాఖను కూడా తన వద్దే ఉంచుకున్న రేవంత్ రెడ్డి ప్రజల ఆస్తిపాస్తులను, ప్రాణాలను రక్షించడంలోనూ, శాంతిభద్రతలను కాపాడటంలోనూ ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రాజకీయ వేధింపులు ఆపి, పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని, ప్రజల్లో భరోసా కల్పించేలా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పరిస్థితుల్లో సామాన్య ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతకాల్సిన పరిస్థితి ఏర్పడిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం తన బాధ్యతను విస్మరిస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రతి పౌరుడికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత హోం మంత్రిగా రేవంత్ రెడ్డిపై ఉందని, ఆయన తన విధుల్లో విఫలమయ్యారని ఆరోపించారు. ఇప్పటికైనా వ్యవస్థలను ప్రక్షాళన చేసి నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# మంత్రి పొంగులేటితో డీజీపీ సీవీ ఆనంద్ భేటీ

### సచివాలయంలో మర్యాదపూర్వక సమావేశం

### పోలీసింగ్‌లో రాష్ట్రం ఆదర్శంగా నిలవాలని ఆకాంక్ష

**హైదరాబాద్, మే 08:** రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ శుక్రవారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో డీజీపీ మంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలుపగా.. ప్రతిగా మంత్రి పొంగులేటి సైతం డీజీపీకి శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. పోలీసింగ్ వ్యవస్థలో రాష్ట్రం ఉన్నత శిఖరాలను చేరుకునేలా నిరంతరం కృషి చేయాలని మంత్రి శ్రీనివాసరెడ్డి ఈ సందర్భంగా అభిలషించారు. శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆయన తన ఆకాంక్షను వ్యక్తం చేశారు.

# మూసీ పునరుజ్జీవనం ఒక సామాజిక బాధ్యత

### క్యాబినెట్ సబ్ కమిటీ

**హైదరాబాద్, మే 08:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు కేవలం ఒక నది ప్రక్షాళన మాత్రమే కాదని, అది ఒక సామాజిక బాధ్యత అని క్యాబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి అంటే మనుషులను దూరం చేయడం కాదని, వారిని భాగస్వాములను చేయడమేనని తెలుపుతూ అధికారులకు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ప్రాజెక్టును అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు తీసుకువెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజల్లో ఉన్న ప్రతి అనుమానాన్ని నివృత్తి చేసి, వారిలో పూర్తిస్థాయి విశ్వసనీయత కలిగించేలా అధికారుల కార్యాచరణ ఉండాలని సబ్ కమిటీ ఆదేశించింది. ప్రజల ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని కమిటీ నొక్కి చెప్పింది. ప్రజల ఆస్తులకు, నివాసాలకు కనీస నష్టం కూడా కలగకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచిస్తోంది. ప్రాజెక్టు రూపకల్పనలో భాగంగా ఇప్పటికే ఉన్న నిర్మాణాల పై అతి తక్కువ ప్రభావం పడేలా అలైన్ మెంట్ ను మార్చుకోవాలని కమిటీ సూచించింది. అత్యంత జాగ్రత్తగా ప్రణాళికలు రూపొందించి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకువెళ్లాలని అధికారులను ఆదేశించింది. మూసీ పునరుజ్జీవనం ద్వారా నగరం రూపురేఖలు మారడమే కాకుండా, పరివాహక ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని కమిటీ అభిప్రాయపడింది. అభివృద్ధి, ప్రజా హితం రెండూ సమాంతరంగా సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన ప్రజా భవన్ లో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తో కలిసి ఉన్నత స్థాయి అధికారులతో ప్రాజెక్టు పురోగతిని సమీక్షించారు. ఈ ప్రాజెక్టును 5 దశల్లో 55 కిలోమీటర్ల మేర చేపట్టనుండగా, తొలి దశ పనులను సుమారు 7,055 కోట్ల వ్యయంతో ప్రారంభించనున్నారు. దీని కోసం ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి నిధులు సమకూర్చుకునేందుకు జరిపిన చర్చలు విజయవంతమయ్యాయని అధికారులు వెల్లడించారు. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ ల నుంచి బాపు ఘాట్ వరకు ఉన్న 21 కిలోమీటర్ల పరిధిలో, ఎటువంటి ప్రభావం లేని తొలి ఐదు కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రులు ఆదేశించారు. నదిలోని చెత్తను తొలగించి శుభ్రపరచడం, నది గర్భాన్ని లోతు చేయడం, వరద నియంత్రణ కోసం రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, నదికి రెండు వైపులా రోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణం వంటి పనులు చేపట్టనున్నారు. నీటి నిల్వ కోసం బ్యారేజీలు, రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు సమగ్ర ప్రాజెక్టు నివేదిక ద్వారా వివరించారు. నార్సింగి నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. టూరిజం అభివృద్ధిలో భాగంగా నదిలో పలుచోట్ల రబ్బర్ డ్యామ్ లను ఏర్పాటు చేయనున్నారు, ఇవి నీటి నిల్వను పెంచడమే కాకుండా బోటింగ్ వంటి సౌకర్యాలకు ఉపయోగపడతాయి. ఈ ప్రాజెక్టు అమలుకు ప్రభుత్వం స్పష్టమైన గడువును నిర్ణయించింది. అన్ని రకాల అనుమతులు పూర్తి చేసుకుని 2026 ఆగస్టు నాటికి పనులు ప్రారంభించి, డిసెంబర్ 2027 నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూనే, ఐఐటీ, జేఎన్టీయూ వంటి సంస్థల సాంకేతిక సహకారం తీసుకోవాలని సూచించారు.

# మైనారిటీల సంక్షేమమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

ఇంధన ఖర్చులు తగ్గి, ఆటో డ్రైవర్ల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని ఆయన వివరించారు.

### కుట్రలను తిప్పికొట్టాలి

ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ తమకు హిందూ, ముస్లిం అనే భేదాలు లేవని.. అందరూ భాయ్ భాయ్ గా ఉండాలన్నదే తమ ఆకాంక్ష అని అన్నారు. అయితే 'సర్' (ఝుతీట) పేరుతో కొందరు తెలంగాణలో ఓట్లు తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారని.. ఇతర రాష్ట్రాల్లో జరిగినట్లు మన దగ్గర జరగనివ్వకూడదని హెచ్చరించారు. ఈ కుట్రలను ప్రజలందరూ కలిసికట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

### విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్య, ఉపాధి రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టాలని అధికారులను ఆదేశించారు. మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించే లక్ష్యంతో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ కాలేజీల్లో స్కిల్ డెవలప్‌మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. మైనారిటీ పాఠశాలల్లో సైతం ఏఐ ఆధారిత బోధనను ప్రవేశపెట్టాలని.. తద్వారా విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా



తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు అజారుద్దీన్, షబ్బీర్ అలీ, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, అనిల్ కుమార్ యాదవ్ తో పాటు పలువురు పాల్గొన్నారు. గ్రూప్స్ పరీక్షల్లో విజయం సాధించిన మైనారిటీ అభ్యర్థులకు మైనారిటీ సంక్షేమ శాఖలోనే కీలక బాధ్యతలు అప్పగించాలని సీఎం సూచించారు. చదువులో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించారు.

# దేశం గర్వించేలా కొడంగల్ అభివృద్ధి

- కొడంగల్ ను ఎడ్యుకేషన్ హబ్ గా మారుస్తాం
- 430 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన
- పేదల తిరుపతిగా మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**కొడంగల్, మే 08:** దేశం మొత్తం కొడంగల్ వైపు చూసేలా అభివృద్ధి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కొడంగల్ ను ఎడ్యుకేషన్ హబ్ గా మారుస్తామని ఉద్ఘాటించారు. అందరి సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడుపుతున్నామని తెలిపారు. పేదల సంక్షేమం కోసం తాము పనిచేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లాలోని సొంత నియోజకవర్గం కొడంగల్ లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. 430 పడకల ఆస్పత్రి నిర్మాణం, దౌలతాబాద్ వెంకటేశ్వర ఆలయం, కోస్గి వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, పలువురు నేతలు పాల్గొన్నారు.

### పేదల తిరుపతిగా ఆలయాల అభివృద్ధి

ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం చేయడం అదృష్టమని చెప్పుకొచ్చారు. తెలంగాణ పేదల తిరుపతిగా ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఒకవైపు గుడి.. మరోవైపు గడి ఏకమైన ఈ నియోజకవర్గాన్ని నందనవనంగా మార్చడానికి అందరూ కలిసి రావడం అభినందనీయమని తెలిపారు. ఆగమశాస్త్ర పండితుడు సుందరవరదాచార్యులు కలలుగన్న గుడి నిర్మాణం సహకారం కావడం సంతోషమని చెప్పారు. తిరుపతిలో ఏ రకమైన పూజలు జరుగుతాయో ఇక్కడ అలాగే పూజలు జరుగుతాయని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ గుడికి కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వస్తారని.. దీంతో కొడంగల్ కు దేశంలో గుర్తింపు వస్తుందని తెలిపారు.

### కృష్ణా జలాలతో కొడంగల్ సస్యశ్యామలం

కొడంగల్ – నారాయణపేట ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి నిధుల కొరత లేదన్నారు. ఈ ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని.. అనుమతులు వచ్చాయని, ఏడాదిన్నర లోపు పూర్తి చేద్దామని చెప్పుకొచ్చారు. కృష్ణా నదీ జలాలతో కొడంగల్ భూములు తడవాలని అన్నారు. కృష్ణా జలాలు ఇక్కడికి వచ్చే వరకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి శ్రీహరిని నిద్రపోవద్దని స్థానిక నేతలకు సూచించారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ నియోజకవర్గానికి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా మంత్రి పదవి దక్కలేదని, ఇప్పుడు కొడంగల్ ఎమ్మెల్యేనైన తనకు సీఎం పదవి దక్కిందని అన్నారు. కొడంగల్ నుంచే దౌలతాబాద్, కోస్గి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. కృష్ణ – వికారాబాద్ రైల్వేలైన్ త్వరలో పూర్తవుతుందని స్పష్టం చేశారు.

రేకులపాడు ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమలను ఆరు నెలల్లో ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని అన్నారు. 20 ఎకరాల్లో లగచర్ల వద్ద విద్యా హబ్ గా మారుస్తున్నామని సీఎం ఉద్ఘాటించారు. ఇక్కడ అనేక విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాజకీయాలు ఎన్నికల సమయంలో ఉండాలని.. ఆ తర్వాత అందరం కలిసి పనిచేయాలని సూచించారు. 2034 వరకు గుంపులు, గ్రూపులు పక్కన పెట్టాలని.. అభివృద్ధికి బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. కొడంగల్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుందామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# రిటైర్డ్ ఐపీఎస్ భార్య దారుణ హత్య

- పనిమనిషి కల్పన ఆధ్వర్యంలో నేపాలీ గ్యాంగ్ ఘాతుకం
- నగదు, బంగారం దోచుకెళ్లిన దుండగులు
- నిందితుల కోసం గాలిస్తున్నాం: సీపీ సజ్జనార్

**హైదరాబాద్, మే 08:** జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్ నగర్‌లో దారుణ హత్య జరిగింది. విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ ధర్మపత్ని తనుజ (55) దారుణ హత్యకు గురయ్యారు. రిటైర్డ్ ఐపీఎస్ నివాసంలో పని చేస్తున్న నేపాల్‌కు చెందిన పనిమనిషి కల్పన ఈ హత్యలో కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. పోలీసుల అనుమానం ప్రకారం కల్పన మరో ముగ్గురితో కలిసి ముందస్తు ప్రణాళికతో ఈ హత్యకు పాల్పడింది. తనుజ ఒంటరిగా ఉన్న విషయాన్ని తన గ్యాంగ్‌కు చెప్పిన కల్పన.. గురువారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో వారితో కలిసి ఈ ఘాతుకానికి ఒడిగట్టింది. హత్య అనంతరం ఇంట్లో ఉన్న బంగారం, నగదు తీసుకుని నిందితులు పరారైనట్లు పోలీసులు భావిస్తున్నారు. గత 8 నెలలుగా ఆ ఇంట్లో కల్పన పని చేస్తోంది. మరోవైపు ఘటనాస్థలికి ఉన్నతాధికారులు చేరుకుని పరిశీలించారు. కేసును అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్న పోలీసులు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల నివాస ప్రాంతంలో హత్య జరగడం సంచలనంగా మారింది. హత్య విషయం తెలిసిన వెంటనే విశ్రాంత ఐపీఎస్ అధికారి ఇంటికి ఖైరతాబాద్ ఎంఎల్ఏ దానం నాగేందర్ చేరుకున్నారు. వినయ్ రంజన్ రాయ్ ప్రస్తుతం బేంగళూరులో ఉన్నట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీపీ వినయ్ రంజన్ రాయ్ సతీమణి తనుజ (55) హత్యకు సంబంధించిన వివరాలను హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీపీ సజ్జనార్ మీడియాకు వెల్లడించారు. రిటైర్డ్ డీజీపీ భార్య తనుజను గురువారం రాత్రి రెండు గంటలకు దుండగులు హత్య చేశారని చెప్పారు. ఇది నేపాలీ గ్యాంగ్ పనిగా ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చామని అన్నారు. కొన్ని క్లూస్ లభించాయని, వాటి ఆధారంగా ఈ కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నేపాలీ పనివాళ్లపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేపాల్ పని మనుషులు ఇంట్లో ఎవరూ లేనప్పుడు నేరాలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. గురువారం రాత్రి రిటైర్డ్ డీజీపీ ఇంట్లో ఎవరూ లేనప్పుడు పనిమనిషి కల్పన అనే మహిళ మరికొందరితో కలిసి ఈ దారుణం చేసిందని తెలిపారు. ఈ ఘటన సమయంలో పిల్లలు ఇద్దరు పై ఫ్లోర్‌లో ఉన్నారని, తనుజ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్నారని వివరించారు. ఇంట్లో ఉన్న పనిమనిషి కల్పనతో బయట వ్యక్తులు కాంటాక్ట్ పెట్టుకుని ఈ క్రైమ్ చేశారని చెప్పారు. ప్రజలు భయాందోళనకు గురికావద్దని, నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. నేపాలీ పనిమనుషులు ఇంట్లో ఏడాది, రెండేళ్లు పని చేసినా వారిపై నిఘా ఉంచాలని సీపీ సజ్జనార్ అన్నారు. చేతులు కట్టేసి నోట్లో బట్టలు కుక్కి ఆమెను ఈ గ్యాంగ్ హత్య చేసిందని సీపీ చెప్పారు. రిటైర్డ్ డీజీపీ తల్లి కోసం ఆమె హైదరాబాద్ వచ్చారని తెలిపారు. ఇటీవల రిటైర్డ్ డీజీపీ తల్లి మరణించారని, అప్పటి నుంచి తనుజ ఇక్కడే ఉంటున్నారని వివరించారు. ఈ కేసులో ఎంత బంగారం, నగదు పోయిందనే అంశాలపై ఆరా తీస్తున్నామని తెలిపారు. నిందితులు బ్యాక్ గేట్ నుంచి ఇంట్లోకి ప్రవేశించారని, ఘటన అనంతరం వెనుక నుంచి పారిపోయారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# థలసేమియా అంటువ్యాధి కాదు

**హైదరాబాద్, మే 08:** థలసేమియా అంటువ్యాధి కాదని.. ఇది జన్యుపరమైన లోపంతో వచ్చే వ్యాధి అని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. మేనరిక వివాహాల వల్ల ఈ ముప్పు పెరుగుతుందని హెచ్చరించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. యువత వివాహానికి ముందు తప్పనిసరిగా స్క్రీనింగ్ చేయించుకోవాలని మంత్రి సూచించారు. కొత్త దంపతులకు జన్యు వ్యాధులపై అవగాహన కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి వివరించారు. రాష్ట్రంలో ఇప్పటికే 11 లక్షల మందికి సికిల్ సెల్ పరీక్షలు పూర్తి చేశామన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా చికిత్స, అవసరమైన మందులు అందిస్తున్నట్లు వెల్లడించారు. బాధితులకు క్రమం తప్పకుండా రక్త మార్పిడి, ఐరన్ చిలేషన్ థెరపీ అవసరమని మంత్రి చెప్పారు. నిమ్స్ లో చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు.

# యువత మత్తుకు దూరంగా ఉండాలి

**హనుమకొండ, మే 08:** యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించారు. యువత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. టాలెంట్ ఆధారంగా మాత్రమే ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు. ఉద్యోగాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. శుక్రవారం ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా కాళోజీ కళాక్షేత్రంలో మెగా జాబ్ మేళా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కలెక్టర్ సత్య శారదాదేవి పాల్గొన్నారు. ఈ జాబ్ మేళాకు నిరుద్యోగులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడారు. సమాజంలో ఇప్పటి జనరేషన్‌లో చాలా మార్పులు వచ్చాయని చెప్పుకొచ్చారు. మనం తప్పు చేయనంతవరకు ఎవరికీ భయపడొద్దని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. యువత ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఉండాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య వ్యాఖ్యానించారు. నిత్యం మనలో మనం యుద్ధం చేసుకోవాలని అన్నారు. యువత ఉద్యోగాల ప్రయత్నాలను ఆపొద్దని చెప్పుకొచ్చారు. యువత కష్టపడి జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎంపీ కడియం కావ్య పేర్కొన్నారు. ఏఐ వచ్చిన తర్వాత ఉన్న ఉద్యోగాలు పోతున్నాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. నేటి పోటీని తట్టుకొని నిలబడాలని అన్నారు. ఉద్యోగం ఎక్కడైనా చేసేందుకు నిరుద్యోగులు సిద్ధంగా ఉండాలని చెప్పుకొచ్చారు. ఆర్మీలో తెలంగాణ యువత ప్రాతినిధ్యం తక్కువ అని తెలిపారు. ఉద్యోగం రావాలంటే నైపుణ్యం కలిగి ఉండాలని అన్నారు.




# పసిడి ధరలు మళ్లీ పెరుగుదల

## కొనుగోలుదారులకు షాక్

**హైదరాబాద్, మే 8 :** అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావంతో దేశంలో బంగారం ధరలు మరోసారి పెరిగాయి. పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడిగా పసిడిని ఎంచుకుంటుండటంతో ధరలు రోజురోజుకూ ఎగబాకుతున్నాయి. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి భారీ షాక్ తగులుతోంది. దేశీయ మార్కెట్‌లో 24 క్యారెట్ల గ్రాము బంగారం ధర రూ.15,301కు చేరుకోగా, 22 క్యారెట్ల గ్రాము పసిడి ధర రూ.14,026గా నమోదైంది. అలాగే 18 క్యారెట్ల గ్రాము బంగారం ధర రూ.11,476 వద్ద కొనసాగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,53,160గా ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,40,410గా ఉంది. ఆర్థిక రాజధాని ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,53,010కు చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,40,260గా నమోదైంది. తెలుగు రాష్ట్రాల్లో కూడా బంగారం ధరలు భారీగా పెరిగాయి. హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,53,010గా ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,40,260కు చేరుకుంది. ఇక వెండి ధరల విషయానికి వస్తే.. ఢిల్లీ, ముంబై నగరాల్లో కిలో వెండి ధర రూ.100 పెరిగి రూ.2,70,100కు చేరుకుంది. అయితే హైదరాబాద్, విజయవాడలో మాత్రం కిలో వెండి ధర రూ.100 తగ్గి రూ.2,74,900గా నమోదైంది.నిపుణుల అభిప్రాయం ప్రకారం అంతర్జాతీయ మార్కెట్‌లో కొనసాగుతున్న అనిశ్చిత పరిస్థితులు, ద్రవ్యోల్బణ భయాలు, డాలర్ మారకపు విలువల్లో మార్పులు బంగారం ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ధరలు మరింత పెరిగే అవకాశముందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# స్మార్ట్‌ఫోన్ ధరలకు బ్రేక్

## క్వాల్‌కామ్ కొత్త చిప్‌సెట్లు




**న్యూఢిల్లీ, మే 8 :** టెక్నాలజీ రంగ దిగ్గజం క్వాల్‌కామ్ మధ్యశ్రేణి, తక్కువ ధర స్మార్ట్‌ఫోన్ల కోసం కొత్త తరం చిప్‌సెట్లను విడుదల చేసింది. ఇటీవల స్మార్ట్‌ఫోన్ల ధరలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ కొత్త చిప్‌లు మార్కెట్‌లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. క్వాల్‌కామ్ విడుదల చేసిన స్నాప్‌డ్రాగన్ 6 జెన్ 5, స్నాప్‌డ్రాగన్ 4 జెన్ 5 చిప్‌సెట్లు మెరుగైన పనితీరు, ఎక్కువ బ్యాటరీ సామర్థ్యం, అధునాతన కనెక్టివిటీ సదుపాయాలను అందిస్తాయని సంస్థ తెలిపింది. ఈ చిప్‌సెట్ల ద్వారా అందుబాటు ధరల్లోనే కృత్రిమ మేధ సాంకేతికతను వినియోగించుకునే స్మార్ట్‌ఫోన్లు తయారు చేసే అవకాశం ఉంటుందని కంపెనీ వెల్లడించింది. క్వాల్‌కామ్ టెక్నాలజీస్ సీనియర్ ఉపాధ్యక్షుడు క్రిస్ పాట్రిక్ మాట్లాడుతూ.. ప్రస్తుతం చిప్‌ల సరఫరా పరిమితమవడం, పరికరాల తయారీ ఖర్చులు పెరగడం వల్ల మొబైల్ ధరలు అధికమవుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా తక్కువ ఖర్చుతో అధునాతన ఫీచర్లు అందించే చిప్‌సెట్లను రూపొందించినట్లు పేర్కొన్నారు. కొత్త చిప్‌సెట్లతో కెమెరా నాణ్యత, గేమింగ్ అనుభవం, పనితీరు మరింత మెరుగవుతాయని కంపెనీ వెల్లడించింది. ముఖ్యంగా కృత్రిమ మేధ ఆధారిత ఫీచర్లను మధ్యశ్రేణి ఫోన్లలో కూడా అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా ఈ చిప్‌లను అభివృద్ధి చేసినట్లు తెలిపింది. ఇప్పటికే ఒప్పో, రియల్‌మీ, షియామీ వంటి ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థలతో క్వాల్‌కామ్ ఒప్పందాలు కుదుర్చుకుంది. దీంతో త్వరలో విడుదలయ్యే కొత్త మోడళ్ల ధరలు కొంత మేర తగ్గే అవకాశముందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ధరల పెంపు ప్రకటనతో బ్రిటానియా షేర్ల పతనం

**ముంబై, మే 8 :** దేశీయ ఎఫ్‌ఎమ్‌సీజీ రంగంలోని ప్రముఖ సంస్థ బ్రిటానియా ఇండస్ట్రీస్ తమ ఉత్పత్తుల ధరలను పెంచనున్నట్లు ప్రకటించడంతో కంపెనీ షేర్లు భారీగా పతనమయ్యాయి. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ధరల పెంపు అమలు చేయనున్నట్లు కంపెనీ మదుపర్లకు వెల్లడించింది. ఈ ప్రకటన తర్వాత మార్కెట్‌లో పెట్టుబడిదారులు అప్రమత్తం కావడంతో బ్రిటానియా షేర్లు దాదాపు 5 శాతం మేర పడిపోయాయి. ప్రస్తుతం కంపెనీ షేరు ధర 4.99 శాతం నష్టంతో రూ.5,524 వద్ద ట్రేడవుతోంది. ముడి సరుకుల ధరలు పెరగడం, ఉత్పత్తి వ్యయాలు అధికమవడం కారణంగానే ధరల పెంపు నిర్ణయం తీసుకున్నట్లు మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. అయితే మరోవైపు కంపెనీ ఆర్థిక ఫలితాలు మాత్రం బలంగా నమోదయ్యాయి. 2025-26 ఆర్థిక సంవత్సరం జనవరి-మార్చి త్రైమాసికంలో బ్రిటానియా నికర లాభం 21.2 శాతం పెరిగి రూ.678 కోట్లకు చేరినట్లు సంస్థ వెల్లడించింది. అంతేకాకుండా అమెరికా-ఇరాన్ యుద్ధ ప్రభావం తమ వ్యాపారంపై పెద్దగా ఉండదని కూడా కంపెనీ స్పష్టం చేసింది. షేర్ హోల్డర్లకు గుడ్‌న్యూస్ చెబుతూ ఈక్విటీ షేర్లపై రూ.90.50 డివిడెండ్ ప్రకటించింది. మొత్తం రూ.407.88 కోట్లను డివిడెండ్ రూపంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపింది. ఇక మరో ప్రముఖ ఎఫ్‌ఎమ్‌సీజీ సంస్థ డాబర్ ఇండియా కూడా ఉత్పత్తుల ధరలను పెంచే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ముడి పదార్థాల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో దాదాపు 4 శాతం వరకు ధరల పెంపు ఉండొచ్చని జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

# మారుతి కార్లపై భారీ ఆఫర్లు

## రూ.2 లక్షలకుపైగా రాయితీలు

**న్యూఢిల్లీ, మే 8 :** దేశీయ కార్ల తయారీ రంగంలో అగ్రగామిగా కొనసాగుతున్న మారుతి సుజుకీ ఈ నెలలో వినియోగదారులకు భారీ శుభవార్త అందించింది. అమ్మకాలను పెంచడం, కొత్త కొనుగోలుదారులను ఆకర్షించడం లక్ష్యంగా పలు మోడళ్లపై ప్రత్యేక రాయితీలు ప్రకటించింది. కొన్ని వాహనాలపై రూ.2 లక్షలకు పైగా డిస్కౌంట్లు అందుబాటులో ఉన్నట్లు కంపెనీ వెల్లడించింది. కంపెనీ ప్రకటించిన ఆఫర్ల ప్రకారం ఫ్రాంక్స్ మోడల్‌పై రూ.25 వేల వరకు, సెలేరియోపై రూ.27,500, ఈకో స్టార్‌పై రూ.37,500, ఎస్-ప్రెస్సోపై రూ.37,500 వరకు రాయితీలు లభించనున్నాయి. అలాగే సియాజ్, బాలెనో మోడళ్లపై రూ.40 వేల వరకు తగ్గింపు అందిస్తున్నారు. స్విఫ్ట్ సీఎన్‌జీ, జిమ్నీ మోడళ్లపై రూ.45 వేల వరకు, ఇగ్నిస్ బ్లాక్ ఎడిషన్‌పై రూ.50 వేల వరకు ప్రత్యేక ఆఫర్ ప్రకటించారు. ఆల్టో కే10, వ్యాగన్ ఆర్ మోడళ్లపై రూ.52,500 వరకు డిస్కౌంట్ లభించనుంది. బ్రెజ్జాపై రూ.55 వేల వరకు, విక్టోరియా మోడల్‌పై రూ.70 వేల వరకు తగ్గింపు అందిస్తున్నారు. ఇక అత్యధిక రాయితీలు గ్రాండ్ విటారా, ఇన్విక్టో మోడళ్లపై ప్రకటించారు. గ్రాండ్ విటారాపై రూ.1.08 లక్షల వరకు, ఇన్విక్టోపై రూ.2.15 లక్షల వరకు ప్రత్యేక డిస్కౌంట్లు లభించనున్నాయి. పెరుగుతున్న పోటీ నేపథ్యంలో వినియోగదారులను ఆకట్టుకునేందుకు



మారుతి సుజుకీ ఈ భారీ ఆఫర్లను తీసుకొచ్చినట్లు ఆటోమొబైల్ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ ఆఫర్లు నగరం, డీలర్‌షిప్, స్టాక్ లభ్యత ఆధారంగా మారే అవకాశం ఉందని కంపెనీ పేర్కొంది.

# 1,100 మంది ఉద్యోగులకు క్లౌడ్‌ఫ్లేర్ షాక్




**అమెరికా, మే 8 :** ప్రపంచ ప్రఖ్యాత సైబర్ భద్రత సంస్థ క్లౌడ్‌ఫ్లేర్ భారీ ఉద్యోగ కోతలను ప్రకటించింది. కృత్రిమ మేధ ఆధారిత కొత్త సాంకేతిక యుగానికి అనుగుణంగా సంస్థను మారుస్తున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా 1,100 మందికి పైగా ఉద్యోగులను తొలగిస్తున్నట్లు వెల్లడించింది. ఇది సంస్థ మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 20 శాతానికి సమానమని సమాచారం. మొదటి త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటించిన అనంతరం ఉద్యోగులకు ఈ విషయాన్ని యాజమాన్యం తెలియజేసింది. అయితే ఇది ఖర్చులు తగ్గించేందుకు తీసుకున్న నిర్ణయం కాదని, భవిష్యత్తులో ఏఐ ఆధారిత వ్యవస్థలకు అనుగుణంగా సంస్థ నిర్మాణాన్ని మార్చే ప్రక్రియలో భాగమని క్లౌడ్‌ఫ్లేర్ సహ వ్యవస్థాపకులు మాథ్యూ ప్రిన్స్, మిషెల్ జాట్లిన్ స్పష్టం చేశారు. గత మూడు నెలల్లో కంపెనీలో ఏఐ వినియోగం 600 శాతానికి పైగా పెరిగిందని వారు వెల్లడించారు. ఇంజినీరింగ్, మానవ వనరులు, ఆర్థిక విభాగాలు సహా దాదాపు అన్ని విభాగాల్లో వేలాది ఏఐ ఏజెంట్ సెషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీంతో సంప్రదాయ పని విధానాల్లో మార్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఉద్యోగుల్లో అనిశ్చితి పెరగకుండా ఉండేందుకు ఒకేసారి ఈ నిర్ణయం తీసుకున్నామని కంపెనీ వెల్లడించింది. తరచూ చిన్నచిన్న కోతలు విధించడం కంటే ఒకేసారి స్పష్టమైన నిర్ణయం తీసుకోవడమే మంచిదని భావించినట్లు తెలిపింది. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని ఉద్యోగ కోతలు ఉండవని కూడా యాజమాన్యం హామీ ఇచ్చింది. ఏఐ ఆధారిత ప్రపంచంలో ఒక ఆధునిక సంస్థ ఎలా పనిచేయాలనే దానిపై కొత్త ప్రమాణాలు సృష్టించడమే తమ లక్ష్యమని క్లౌడ్‌ఫ్లేర్ పేర్కొంది. అలాగే ఉద్యోగాలు కోల్పోయిన వారికి పరిశ్రమలోనే అత్యుత్తమ పరిహార ప్యాకేజీలు అందిస్తున్నట్లు వెల్లడించింది.

## ఇక ఏటీఎం, యూపీఐ ద్వారా

# పీఎఫ్ నగదు

**న్యూఢిల్లీ, మే 8 :** దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఉద్యోగులకు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ కీలక శుభవార్త అందించింది. పీఎఫ్ నగదు ఉపసంహరణ ప్రక్రియను మరింత వేగవంతం, సులభతరం చేస్తూ 'ఈపీఎఫ్‌వో 3.0' వ్యవస్థను అమల్లోకి తీసుకురానుంది. ఈ కొత్త విధానంతో సభ్యులు తమ పీఎఫ్ ఖాతాలోని డబ్బులను ఇకపై ఏటీఎం కార్డు లేదా యూపీఐ ద్వారా నేరుగా పొందే అవకాశం కలగనుంది. ప్రస్తుతం పీఎఫ్ డబ్బులు ఖాతాలోకి రావడానికి వారం నుంచి పది రోజుల వరకు సమయం పడుతోంది. అయితే కొత్త సదుపాయం ద్వారా సభ్యులు తమ మొత్తం బ్యాలెన్స్‌లో గరిష్టంగా 50 శాతం వరకు తక్షణమే ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. అత్యవసర వైద్య ఖర్చులు, కుటుంబ అవసరాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈపీఎఫ్‌వో సభ్యుల కోసం ప్రత్యేకంగా పీఎఫ్ ఏటీఎం కార్డులను జారీ చేయాలని సంస్థ యోచిస్తోంది. ఈ కార్డులు నేరుగా సభ్యుల పీఎఫ్ ఖాతాలకు అనుసంధానమై ఉంటాయి. అలాగే యూఏఎన్‌కు అనుసంధానించిన బ్యాంక్ ఖాతా ద్వారా యూపీఐ సేవలను ఉపయోగించుకునే విధంగా సాంకేతిక మార్పులు చేస్తున్నారు. మే నెలాఖరులోపు ఈ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశముందని సమాచారం. అయితే ఈ డిజిటల్ సేవలను వినియోగించుకోవాలంటే కొన్ని అర్హతలు తప్పనిసరిగా ఉండాలి. సభ్యుడికి యాక్టివ్ యూఏఎన్ ఉండాలి. కేవైసీ ప్రక్రియ పూర్తై ఉండాలి. ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ వంటి సమాచారం పీఎఫ్ ఖాతాతో అనుసంధానమై ఉండాలి. ఇక కేంద్ర కార్మిక శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈపీఎఫ్‌వో రికార్డు స్థాయిలో




8.31 కోట్ల క్లెయిమ్‌లను పరిష్కరించింది. ఇందులో 71 శాతం అడ్వాన్స్ క్లెయిమ్‌లను కేవలం మూడు రోజుల్లోనే ఆటో విధానంలో క్లియర్ చేయడం విశేషంగా మారింది. అలాగే 1.59 కోట్ల మంది సభ్యులు యజమాని ప్రమేయం లేకుండానే తమ బ్యాంక్ వివరాలను స్వయంగా నవీకరించుకున్నట్లు వెల్లడించారు.

# ఫాస్ట్‌ట్యాగ్ వినియోగదారులకు హెచ్చరిక

## ఈ తప్పు చేస్తే డబుల్ టోల్ ఛార్జీ

**న్యూఢిల్లీ, మే 8 :** ఫాస్ట్‌ట్యాగ్ వినియోగదారులకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ కీలక హెచ్చరిక జారీ చేసింది. కొత్త మార్గదర్శకాల ప్రకారం ఫాస్ట్‌ట్యాగ్‌ను సరైన విధంగా ఉపయోగించకపోతే రెట్టింపు టోల్ ఛార్జీలు చెల్లించాల్సి వస్తుందని స్పష్టం చేసింది. తాజా నిబంధనల ప్రకారం వాహనదారులు తమ ఫాస్ట్‌ట్యాగ్‌ను వాహనం ముందు అద్దం లోపలి భాగంలో తప్పనిసరిగా అతికించాలి. ఒకవేళ ఫాస్ట్‌ట్యాగ్ యాక్టివ్‌గా ఉన్నప్పటికీ దానిని చేతిలో చూపించడం లేదా వాహనంలో ఎక్కడైనా ఉంచడం చేసినట్లయితే ఆ ట్యాగ్‌ను బ్లాక్‌లిస్ట్‌గా పరిగణించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఇలాంటి వాహనాల నుంచి టోల్ ప్లాజాల వద్ద రెట్టింపు టోల్ ఫీజు వసూలు చేయనున్నట్లు వెల్లడించారు. టోల్ బూత్‌ల వద్ద స్కానింగ్ ప్రక్రియ వేగంగా పూర్తవ్వడం, ట్రాఫిక్ రద్దీ తగ్గించడం లక్ష్యంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. టోల్ ప్లాజాల వద్ద అమర్చిన సీసీ కెమెరాలు అద్దంపై ఫాస్ట్‌ట్యాగ్ సరిగా లేకపోయిన వాహనాలను గుర్తిస్తాయని అధికారులు పేర్కొన్నారు. అందువల్ల టోల్ సిబ్బందితో వాగ్వాదాలకు దిగినా ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. ఇకపై నగదు చెల్లింపులపై కూడా కఠిన నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ఏప్రిల్ 2026 నుంచి జాతీయ రహదారులపై నగదు ద్వారా టోల్ చెల్లింపులను పూర్తిగా నిలిపివేశారు.




ప్రస్తుతం ఫాస్ట్‌ట్యాగ్ లేదా యూపీఐ ద్వారానే టోల్ చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఫాస్ట్‌ట్యాగ్ పనిచేయకపోతే యూపీఐ ద్వారా చెల్లింపు చేసే సమయంలో అదనంగా 25శాతం ఛార్జీ విధించే అవకాశముందని సమాచారం. అలాగే గుర్తింపు కార్డుల ఆధారంగా టోల్ మినహాయింపుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కూడా కొత్త చర్యలు చేపట్టారు. తరచుగా జాతీయ రహదారులపై ప్రయాణించే ప్రయాణికుల కోసం వార్షిక పాస్ విధానాన్ని కూడా ప్రవేశపెట్టారు. ప్రైవేట్ కార్లకు సంవత్సరానికి రూ.3,075 చెల్లిస్తే 200 ప్రయాణాల వరకు ఈ సదుపాయం వర్తించనుంది.

ఉద్యమ కెరటం
శనివారం
9 మే 2026




## సంపాదకీయం

# మెజారిటీ లేకపోవడం గవర్నర్ తప్పా?

### రాజ్యాంగం తెలియని విమర్శలపై విశ్లేషణ

### గవర్నర్ పరిధి.. రాజ్యాంగ విధి

### హంగ్ వేళ హార్స్ ట్రేడింగ్‌కు అడ్డుకట్టే లక్ష్యం

### టీవీకే అధినేత విజయ్‌కు 'మ్యాజిక్ ఫిగర్' సవాల్

### సర్కారియా కమిషన్ సిఫారసుల మాటేమిటి?

**రాజ్యాంగం, ప్రజాస్వామ్య ప్రక్రియలు, చట్టసభల పనితీరుపై కనీస అవగాహన లేకుండా విమర్శలు చేయడం రాజకీయ ఫ్యాషన్ అయిపోయింది. ముఖ్యంగా తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత అక్కడ నెలకొన్న 'హంగ్' (ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ రాని స్థితి) నేపథ్యంలో గవర్నర్ విశ్వనాథ్ కర్లేకర్ తీరుపై కొందరు సినిమా నటులు, ప్రతిపక్ష నేతలు చేస్తున్న విమర్శలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయి. 234 స్థానాలున్న అసెంబ్లీలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే ఉండాల్సిన కనీస బలం (మ్యాజిక్ ఫిగర్) 118. కానీ, అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ నేతృత్వంలోని టీవీకే 108 స్థానాల వద్దే ఆగిపోయింది. ఈ క్రమంలో గవర్నర్ మద్దతు లేఖలు కోరడంలో తప్పు పట్టాల్సిన అవసరమేముంది?**

#### అతిపెద్ద పార్టీ అంటే అధికారం కాదు

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 164 ప్రకారం ముఖ్యమంత్రిని గవర్నర్ నియమిస్తారు. అయితే, హంగ్ ఏర్పడినప్పుడు ఎవరిని పిలవాలన్నది గవర్నర్ 'విచక్షణాధికారం' మీద ఆధారపడి ఉంటుంది. సర్కారియా కమిషన్ సిఫారసుల ప్రకారం.. ముందుగా ఎన్నికల పూర్వ కూటమికి, అది లేని పక్షంలో అతిపెద్ద పార్టీకి అవకాశం ఇవ్వవచ్చు. కానీ, కేవలం అతిపెద్ద పార్టీగా గెలిచినంత మాత్రాన ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఎక్కడా రూల్ లేదు. సదరు పార్టీకి సభలో మెజారిటీ నిరూపించుకోగల సభ్యుల మద్దతు ఉందని గవర్నర్ సంతృప్తి చెందాలి. 108 సీట్లు ఉన్న విజయ్, మిగిలిన 10 మంది ఎమ్మెల్యేల మద్దతు లేఖలను సమర్పించకుండానే గవర్నర్‌పై ఒత్తిడి తీసుకురావడం అప్రజాస్వామికం.

#### హార్స్ ట్రేడింగ్‌కు చెక్ పెట్టేందుకేనా?

ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాక బలాన్ని నిరూపించుకోవడానికి రెండు వారాల సమయం కోరడంలోనే అసలు మెలిక ఉంది. అధికారం చేతిలోకి వచ్చాక ఇతర పార్టీల ఎమ్మెల్యేలను 'కొనుగోలు' చేయడం భారత రాజకీయంలో కొత్తేమీ కాదు. గతంలో గోవా, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఇలాంటి పరిణామాల వల్ల ప్రజాస్వామ్యం అపహాస్యమైంది. అటువంటి దుష్ట సంప్రదాయాలకు తావు ఇవ్వకుండా, ముందే మద్దతు లేఖలు కోరడం ద్వారా గవర్నర్ రాజ్యాంగబద్ధంగానే వ్యవహరిస్తున్నారు. దీనిని బీజేపీ అజెండాగా చిత్రీకరించడం ప్రకాష్ రాజ్, విశాల్ వంటి వారి అజ్ఞానానికి నిదర్శనం తప్ప మరొకటి కాదు.

#### బిహార్ 2005 పాఠాలు

గతంలో బిహార్‌లో 2005 ఎన్నికల తర్వాత ఏ పార్టీకీ మెజారిటీ రాని పరిస్థితుల్లో అప్పటి గవర్నర్ బూటాసింగ్ అసెంబ్లీని రద్దు చేయడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రస్తుతం తమిళనాడులో డీఎంకే కూటమి (73), అన్నాడీఎంకే కూటమి (53) తమలో తాము భీష్మించుకుని కూర్చోవడం వల్ల ప్రతిష్టంభన ఏర్పడింది. వీరంతా కలిస్తే 121 సీట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు, లేదా ఎవరైనా విజయ్‌కు మద్దతు ప్రకటించాల్సి ఉంటుంది.

**రాజకీయాల్లోకి రావడం ఎవరైనా చేయవచ్చు, కానీ రాజ్యాంగ నిబంధనలు తెలుసుకోవడం కనీస బాధ్యత. డబ్బు, మందబలంతో గెలవవచ్చు కానీ, చట్టసభలను నడపడం కేవలం అంకెలాట మీద మాత్రమే ఆధారపడి ఉండదు. ఇప్పటికైనా టీవీకే అధినేత విజయ్ విమర్శలపై దృష్టి పెట్టకుండా, తనకు అవసరమైన మద్దతు లేఖలను సమీకరించి గవర్నర్‌కు సమర్పించడమే ఉత్తమ మార్గం. అప్పుడే ఈ రాజకీయ ప్రతిష్టంభనకు తెరపడుతుంది.**

# బెంగాల్ రాజకీయాల్లో బీజేపీ శకం

- రాష్ట్ర సీఎంగా సువేందు అధికారి
- శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నిక
- అమిత్ షా సమక్షంలో ఎమ్మెల్యేల భేటీ
- నేడు సీఎంగా సువేందు ప్రమాణ కార్యక్రమం
- ప్రధాని మోదీ, అమిత్ షా, తదితరులు హాజరు





**కోల్‌కతా, మే 8:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త శకం మొదలైంది. రాష్ట్రంలో తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి పగ్గాలు చేపట్టనున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని బిశ్వ బంగ్లా కన్వెన్షన్ సెంటర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో జరిగిన బీజేపీ శాసనసభా పక్ష సమావేశంలో సువేందు అధికారిని శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం ఉదయం 11:00 గంటలకు కోల్‌కతాలోని చరిత్రాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ నేతలు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. పాలనలో సమతుల్యత కోసం ఇద్దరు ఉపముఖ్యమంత్రులను నియమించాలని బీజేపీ హైకమాండ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ఒక డిప్యూటీ సీఎం పదవిని మహిళా నేత బహుశా అగ్నిమిత్ర పాల్‌కు కేటాయించే అవకాశం ఉంది. ప్రాంతీయ సమీకరణలు దృష్టిలో పెట్టుకుని ఉత్తర బెంగాల్, గిరిజన ప్రాంతాలకు కేబినెట్‌లో పెద్దపీట వేయనున్నారని సమచారం. తమిళనాడులో విజయ్ లాగే సువేందు అధికారి కూడా ఈ ఎన్నికల్లో రెండు చోట్ల భవానీపూర్, నందిగ్రామ్ పోటీ చేసి రెండింటిలోనూ ఘనవిజయం సాధించారు. ముఖ్యంగా భవానీపూర్‌లో మమతా బెనర్జీపై 15,000 పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలిచి 'జెయింట్ కిల్లర్'గా నిలిచారు. 294 స్థానాలున్న బెంగాల్ అసెంబ్లీలో బీజేపీ 207 స్థానాలు గెలుచుకుని స్పష్టమైన మెజారిటీని సాధించింది. టీఎంసీ 80 స్థానాలకే పరిమితమైంది. ఉదయం జరగనున్న ఈ కార్యక్రమం ద్వారా బెంగాల్ గడ్డపై కమల దళం అధికారికంగా పాలనను ప్రారంభించనుంది. సువేందు 1970 డిసెంబరు 15న తూర్పు మేదినీపుర్‌లోని కర్కులీలో జన్మించారు. ఎంఏ చదివారు. ఆయనది రాజకీయ నేపథ్యమున్న కుటుంబం. తండ్రి సిసిర్ అధికారి ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేశారు. యూపీఏ హయాంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రిగానూ ఉన్నారు. సువేందు 1995లో తొలిసారి కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్‌గా గెలిచారు. 1998లో తండ్రితో కలిసి టీఎంసీలో చేరారు. సువేందు 2006-09 మధ్య రాజకీయాల్లో బాగా ఎదిగారు. 2006లో తొలిసారి కొంటాయి (దక్షిణ) నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచారు. అదే ఏడాది కొంటాయి మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్‌గానూ బాధ్యతలు చేపట్టి.. మూడేళ్లు ఆ పదవిలో కొనసాగారు. సువేందు రాజకీయ జీవితంలో 2007 నాటి నందిగ్రామ్ ఉద్యమానిది ప్రత్యేక పాత్ర. నందిగ్రామ్‌లో 10 వేల ఎకరాలు సమీకరించి సెజ్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్రంలోని అప్పటి వామపక్ష ప్రభుత్వం భావించింది. దానికి వ్యతిరేకంగా తృణమూల్ పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టింది. వాటిని సువేందు ముందుండి నడిపించారు. నందిగ్రామ్ ఉద్యమం విజయవంతం కావడంతో.. జంగల్ మహల్ (పశ్చిమ మేదినీపుర్, పురూలియా, బాంకురా జిల్లాలు) ప్రాంతానికి తృణమూల్ ఇంఛార్జిగా సువేందును మమత నియమించారు. మమతకు అత్యంత సన్నిహిత నేతల్లో ఒకరిగా ఎదిగారు. సువేందు 2009లో తమ్లుక్ స్థానం లోక్‌సభ ఎంపీగా గెలిచి జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2016లో నందిగ్రామ్ ఎమ్మెల్యేగా విజయం సాధించి.. మమత సర్కారులో మంత్రి పదవి చేపట్టారు. తృణమూల్ వ్యవస్థాపక సభ్యుడైన ముకుల్ రాయ్ 2017లో పార్టీని వీడారు. అప్పటి నుంచి తృణమూల్‌లో సువేందు ప్రభావం మరింత పెరిగింది. పార్టీలో మమత తర్వాత నంబర్-2 ఈయనేనని అంతా అనుకున్నారు. అయితే క్రమంగా పరిస్థితులు మారిపోయాయి. మమత తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీకి పార్టీలో అధిక ప్రాధాన్యమివ్వడం, ఆయనకే పార్టీ పగ్గాలు అప్పగించేలా కనిపించడం సువేందుకు రుచించలేదు. అప్పటికే శారదా కుంభకోణంలో ఆరోపణలు రావడంతో కొంత ఉక్కిరిబిక్కిరయ్యారు. దీంతో 2020 చివర్లో అనూహ్యంగా తృణమూల్‌ను వీడి భాజపాలో చేరారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తరఫున నందిగ్రామ్ నుంచి బరిలోకి దిగిన సువేందు.. మమతను ఓడించారు. అనంతరం రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో భవానీపుర్‌లో మమతను మరోసారి ఓడించి, ఇప్పుడు ఏకంగా బెంగాల్ సీఎంగా బాధ్యతలు చేపట్టడానికి సిద్ధమయ్యారు.

## కేరళం సీఎం రేసులో కేసీ వేణుగోపాల్



### పార్టీ అధ్యక్షుడికి పరిశీలకుల నివేదిక

**న్యూఢిల్లీ, మే 8:** కేరళంలో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి విజయం సాధించడంతో ముఖ్యమంత్రి ఎంపికకు కసరత్తు జరుగుతోంది. ఈ రేసులో లోక్‌సభ ఎంపీ కేసీ వేణుగోపాల్ ముందున్నారని తెలుస్తోంది. ఈ మేరకు పార్టీ పరిశీలకులు అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్‌లు తమ నివేదికను పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు సమర్పించినట్టు పార్టీ వర్గాలు శుక్రవారంనాడు తెలిపాయి. పార్టీకి ఎన్నికైన ఎమ్మెల్యేలు, కూటమి భాగస్వాములు, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని పార్టీ తుది నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. సీఎం అభ్యర్థుల రేసులో కేసీ వేణుగోపాల్‌తో పాటు గత అసెంబ్లీలో విపక్ష నేత వీడి సతీశన్, వెటన్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాల పోటీ పడ్డారు. అయితే పార్టీ అధిష్టానానికి అత్యంత విశ్వసనీయుడిగా పేరున్న 63 ఏళ్ల కేసీ వేణుగోపాల్ ముందు వరుసలో ఉన్నట్టు చెబుతున్నారు. ఆయనను తదుపరి సీఎంగా అధిష్టానం ప్రకటిస్తే ఎంపీ స్థానానికి ఆయన రాజీనామా చేయాల్సి ఉంటుంది. కాగా, కాంగ్రెస్ కార్యకర్తలు బహిరంగంగానే వేణుగోపాల్ అభ్యర్థిత్వానికి మద్దతు ప్రకటించారు. యూడీఎఫ్ విజయానికి నిజమైన వ్యూహకర్త ఆయనేనని, ఆయనను నాయకన్, హీరో అని చిత్రీకరిస్తూ పార్టీ కార్యాలయం వెలుపల పోస్టర్లు కూడా వెలిసాయి.


## హంటావైరస్‌తో భారత్‌కు ముప్పు లేదు

- ఎన్ఐవీ భరోసా
- ఎలుకలు ఉన్న ప్రాంతాల పట్ల జాగ్రత్త అవసరం
- మరిన్ని కేసులు వచ్చే ఛాన్స్ ఉందన్న డబ్ల్యూహెచ్‌వో

**న్యూఢిల్లీ/పుణె, మే 8:** ఎంవీ హిండియస్ అనే క్రూజ్ నౌకలో హంటావైరస్ వెలుగుచూడటం, అందులో ఇద్దరు భారతీయులు ఉండటంతో దేశవ్యాప్తంగా వ్యక్తమవుతున్న ఆందోళనలపై నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవీ) స్పష్టతనిచ్చింది. ఈ వైరస్ వల్ల భారత్‌కు తక్షణ ముప్పు ఏమీ లేదని ఎన్ఐవీ డైరెక్టర్ నవీన్ కుమార్ వెల్లడించారు. ఈ వైరస్ అక్కడక్కడ కనిపిస్తున్నప్పటికీ, ఇది సామూహికంగా వ్యాప్తి చెందుతుందని చెప్పడానికి ఎటువంటి ఆధారాలు లేవని ఆయన స్పష్టం చేశారు. హంటావైరస్ గురించి నవీన్ కుమార్ వివరిస్తూ.. ఇది కొవిడ్ లేదా ఇన్‌ఫ్లుయెంజా వంటి వైరస్ కాదని పేర్కొన్నారు. ఆసియా, ఐరోపా దేశాల్లో కనిపించే ఈ రకం వైరస్‌లు మానవుల నుంచి మానవులకు సంక్రమించడం చాలా అరుదని చెప్పారు. కేవలం దక్షిణ అమెరికాలో కనిపించే 'ఆండెస్' వంటి కొన్ని జాతుల్లో మాత్రమే మానవుల మధ్య వ్యాప్తి జరిగినట్లు రికార్డులు ఉన్నాయని తెలిపారు. ఈ వైరస్ సోకిన ఒకటి నుంచి ఐదు వారాల తర్వాత లక్షణాలు బయటపడతాయని, ప్రాథమికంగా ఫ్లూ వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. దేశంలో ఇటువంటి వైరస్‌లను గుర్తించేందుకు సరిపడా ల్యాబ్ సౌకర్యాలు ఉన్నాయని ఎన్ఐవీ తెలిపింది. ముఖ్యంగా నౌకలు, గిడ్డంగులు, స్టోరేజీ కేంద్రాలు, గాలి ప్రసరణ తక్కువగా ఉండే ప్రదేశాల్లో పనిచేసే వారు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించింది. ఎలుకలు ఎక్కువగా ఉండే ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరించారు.

### డబ్ల్యూహెచ్‌వో అంచనా

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనోమ్ స్పందిస్తూ.. హంటావైరస్ వల్ల ప్రజారోగ్యానికి కలిగే ముప్పు ప్రస్తుతానికి తక్కువగానే ఉన్నట్లు అంచనా వేస్తున్నామన్నారు. అయితే వైరస్ పొదిగే కాలం ఎక్కువగా ఉన్నందున భవిష్యత్తులో మరిన్ని కేసులు నమోదయ్యే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి మరియా వాన్ మాట్లాడుతూ, ఈ వైరస్ వ్యాప్తిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.






## తమిళనాడులో విజయ్‌కు లైన్ క్లియర్

### సంఖ్యా బలం రెడీ

**చెన్నై:** తమిళనాడులో టీవీకే ప్రభుత్వం ఏర్పాటుపై తలెత్తిన ఉత్కంఠకు తెరపడనుంది. తగినంత సంఖ్యాబలంతో గవర్నర్ ఆర్వీ ఆర్లేకర్‌ను మరోసారి విజయ్ కలుసుకోనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. వీసీకే, సీపీఐ, సీపీఎం పార్టీలు టీవీకేకు మద్దతు ప్రకటించాయని, మద్దతు లేఖలు తీసుకుని గవర్నర్‌ను కలుస్తారని ఆ వర్గాలు వెల్లడించాయి. బుధ, గురువారాల్లో గవర్నర్‌ను విజయ్ కలిశారు. అయితే సంఖ్యాబలంతో రావాలని గవ్నరర్ సూచించడంతో టీవీకే ప్రభుత్వం ఏర్పాటులో జాప్యం తలెత్తింది. టీవీకే బలంపరంగా చూస్తే ఆ పార్టీకి విజయ్ గెలిచిన రెండు నియోజకవర్గాలతో సహా 108 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు టీవీకేకు మద్దతు ప్రకటించడంతో ఆ బలం 113కు చేరింది. టీవీకే బలనిరూపణకు మరో ఆరు సీట్లు అవసరం. టీవీకే భవితవ్యాన్ని నిర్దేశించే బలం వీసీకే, సీపీఐ, సీపీఎం చేతుల్లో ఉంది. వీసీకే-2, సీపీఐ-2, సీపీఎం-2 సీట్లు గెలుచుకున్నాయి. ఈ పార్టీలు టీవీకేతో జతకడితే సింపుల్ మెజారిటీతో టీవీకే ప్రభుత్వం ఏర్పాటు సాధ్యమవుతోంది. ఈ నేపథ్యంలో సీపీఐ వర్కింగ్ కమిటీ, సీపీఎం రాష్ట్ర కమిటీ టీవీకేకు మద్దతు ప్రకటించినట్టు తెలుస్తోంది. వీసీకేకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా మద్దతు ప్రకటించినట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించిన ఈ మూడు పార్టీలు తుది ప్రకటన చేయనున్నాయి.

**సంఖ్యా బలం ఇలా..**

| | |
|---|---|
| టీవీకే | : 107 |
| కాంగ్రెస్ | : 5 |
| సీపీఐ | : 2 |
| సీపీఎం | : 2 |
| వీసీకే | : 2 |

### శనివారం 11 గంటలకు ప్రమాణస్వీకారం

తమిళనాడులో ఏకైక పెద్ద పార్టీగా నిలిచిన విజయ్ సారథ్యంలోని టీవీకే (ఎఖ) ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగగమైంది. మెజారిటీకి అవసరమైన సంఖ్యాబలంతో గవర్నర్ ఆర్వీ అర్లేకర్‌ను విజయ్ రాజ్‌భవన్‌లో శుక్రవారం సాయంత్రం కలిసారు. ఎమ్మెల్యేల మద్దతు లేఖను ఆయనకు అందజేశారు. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందా కోరారు. దీంతో సంతృప్తి చెందిన గవర్నర్ కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించారు. మరోవైపు కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. శనివారం మధ్యాహ్నం 11 గంటలకు చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు.

## గ్రామ సమస్యలను పరిష్కరించాలి

**మంత్రి జూపల్లిని కలిసిన సర్పంచ్ రాజేందర్ జాదవ్**



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** జిల్లా కాగజ్నగర్ మండలంలోని భట్టు పల్లిగ్రామంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోసం గ్రామ సర్పంచ్ రాజేందర్ జాదవ్ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను మంత్రి దృష్టి కి తీసుకెళ్లారు. భట్టుపల్లి ట్రాన్స్ఫార్మర్ నుంచి జీడిచేను వాటర్ ట్యాంక్ వరకు ఉన్న బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిందని, దీంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ముఖ్యంగా రైతులు పంటలను రవాణా చేయడంలో, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వెంటనే రోడ్డును పునర్నిర్మించాలని కోరారు. అలాగే గ్రామంలో ధ్వంసమైన డ్రైనేజీ కాలువలను పునరుద్ధరించాలని విన్నవించారు. వర్షాకాలంలో మురుగు నీరు రోడ్లపైకి చేరి ప్రజలకు అసౌకర్యం కలుగుతోందని వివరించారు. సమస్యలను విన్న మంత్రి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్సీ దండే విఠల్తో కలిసి సానుకూలంగా స్పందించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు మారిశెట్టి రాజేష్, పర్వతి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు మజ్జి గ పంపిణీ



**ఉద్యమ కెరటం, తిర్యాణి:** మండలంలోని పెరకపల్లి గ్రామానికి చెందిన ఉపాధిహామీ కూలీలకు అనిల్ అన్న యువ సైన్యం ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల పరిధిలో ఎండలో పనిచేస్తున్న కూలీలకు ఈ సేవా కార్యక్రమం చేపట్టారు. తీవ్ర ఎండల్లో ఉపాధి పనులు నిర్వహిస్తున్న కూలీలు నీడ, తాగునీటి సౌకర్యాల లేమితో ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న అనిల్ అన్న యువ సైన్యం సభ్యులు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి మజ్జిగ పంపిణీ చేశారు. దీంతో కూలీలు ఉపశమనం పొందారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ తమ ఇబ్బందులను గుర్తించి సహాయం అందించిన అనిల్ అన్న యువ సైన్యం వ్యవస్థాపకుడు అనిల్ గౌడ్కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాల సమయంలో అండగా నిలవడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం అనిల్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అనిల్ అన్న యువ సైన్యం ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అనిల్ అన్న యువ సైన్యం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆడే గజేందర్ పరామర్శ



**ఉద్యమ కెరటం, సొనాల:** ఇటీవల మృతి చెందిన సొనాల మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బద్దం సాయిరెడ్డి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ శుక్రవారం పరామర్శించారు. సాయిరెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్నాయన సొనాలలోని వారి నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులను ఓదార్చారు. సాయిరెడ్డి కుమారుడు బద్దం రవీందర్ రెడ్డిని కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్దం సాయిరెడ్డి కాంగ్రెస్ పార్టీ కి విశేష సేవలు అందించిన నాయకుడని కొనియాడారు. వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట తెలంగాణ రాష్ట్ర విచార్ విభాగ్ కోఆర్డినేటర్ తుల అరుణ్, చింతల్ బోరి సర్పంచ్ గైక్వాడ్ శ్రీరాం, వజ్జర్ సర్పంచ్ ఆత్రం లక్ష్మణ్, కోటకే సర్పంచ్ సంగ్రామ్, డీసీసీ జిల్లా కార్యదర్శి లోలపు పోశెట్టి, హరి సింగ్, సీనియర్ నాయకులు గాజుల పోతన్న, ముండే శ్రీధర్, తుల అజయ్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, ఎండీ సద్దాం, మౌలానా తదితరులు ఉన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

- **రాష్ట్ర ఆబ్కారీ - మద్య నిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు**




**ఉద్యమ కెరటం, కాగజ్ నగర్:** అర్హత గల ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆబ్కారీ - మద్య నిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్ క్లబ్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్లు, రెండు పడక గదుల పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఆదిలాబాద్ శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె. హరిత, ఎస్.పి. నితికా పంత్, జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్రే అనిల్, కాగజ్ నగర్ మున్సిపల్ చైర్ పర్సన్ షాహిన్ సుల్తానా లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రికి మాట్లాడుతూ జిల్లాలో రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందని తెలిపారు. బోరిగాం శివారులో నిర్మించిన 2 పడక గదుల ఇండ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. కాగజ్ నగర్ పట్టణానికి మొదటి విడతలు 630 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని, మొదటి విడతలో రానివారు నిరాశ చెందవలసిన అవసరం లేదని, అర్హత గల వారికి రెండవ విడతలు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. కాగజ్ నగర్ పట్టణ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, రహదారి విస్తరణ, మురుగు కాలువల వ్యవస్థ, సి సి రహదారుల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా లో అసంపూర్తిగా ఉన్న వంతెనల పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొమురం భీం ప్రాజెక్టు ఆనకట్ట పనులు సి డబ్ల్యూ సి నివేదిక రాగానే ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. శాసనమండలి సభ్యులు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. కాగజ్ నగర్ పట్టణ అభివృద్ధికి 18 కోట్ల రూపాయల నిధులతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని తెలిపారు. మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అందజేయడంలో ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. సిర్పూర్ శాసనసభ్యులు మాట్లా డుతూ ప్రాణహిత నదిపై బరాజ్ నిర్మాణం చేపడితే ఈ ప్రాంతానికి సాగునీరు అంది భూములు సస్యశ్యామలం అవుతాయని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణానికి ప్రజా ప్రతినిధులు అందరూ సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. కాగజ్ నగర్ పట్టణ అభివృద్ధికి అదనంగా నిధులు మంజూరు చేయాలని, పోడు భూములను సాగు చేయకుండా అటవీ అధికారుల అడ్డుపడుతున్న సమస్యను పరిష్కరించాలని, కార్మికుల సంక్షేమం కోసం సిర్పూర్ పేపర్ మిల్ యాజమాన్యం దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం 288 మంది లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పి.డి. టి.ఎన్. ప్రకాష్ రావు, మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# నిర్లక్ష్యపు నీడలో సిసి రోడ్డు ...!

**క్యూరింగ్ మరిచిన కాంట్రాక్టర్...!**

**ఉద్యమ కెరటం, వాంకిడి :** మండల కేంద్రంలోని సోనాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల గణేష్ పూర్ గ్రామంలో అభివృద్ధి పనులు వివాదాస్పదంగా మారాయి. లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత కొంతకాలంగా గుంతలమయంగా ఉన్న గణేష్ పూర్ గ్రామంలో కొడప హనుమంతరావు ఇంటి నుండి హనుమాన్ మందిర్ వరకు ఈ సిసి రోడ్డును నిర్మించారు. రోడ్డు సౌకర్యం మెరుగుపడుతుందని గ్రామ ప్రజలు ఆశించిన తరుణంలో, కాంట్రాక్టర్ పనితీరు వారిని ఆవేదనకు గురిచేస్తోంది.సాధారణంగా సిసి రోడ్డు వేసిన తర్వాత దానిపై మట్టితో కట్టలు కట్టి నీటితో



క్యూరింగ్ చేయాల్సి ఉంటుంది. అప్పుడే ఆ రోడ్డు పటిష్టంగా మారి ఎక్కువ కాలం మన్నిక వస్తుంది. అయితే సదరు కాంట్రాక్టర్ రోడ్డు వేయడమే తప్ప, క్యూరింగ్ చేయడాన్ని పూర్తిగా మరిచిపోయారు. కనీసం మట్టి కట్టలు కూడా వేయకపోవడంతో నూతనంగా వేసిన రోడ్డు ఎండకు ఎండి, త్వరగా పగుళ్లు ఇచ్చి పాడైపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయల ప్రజా ధనం వెచ్చించి వేస్తున్న రోడ్డు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల కొన్ని రోజులకే కొట్టుకుపోతుందని వారు ఆందోళన చెందుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని, వెంటనే సిసి రోడ్డుపై క్యూరింగ్ చేయించాలని గణేష్ పూర్ గ్రామస్తులు కోరుతున్నారు.

# ప్రాణహిత బ్యారేజ్ స్థలాన్ని పరిశీలించిన మంత్రులు

**త్వరలో మహారాష్ట్ర సీఎంతో భేటీ**

**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కౌటాల మండలంలోని తుమ్మిడి హెట్టి గ్రామం వద్ద నిర్మించనున్న ప్రాణహిత బ్యారేజ్ స్థలాన్ని రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి శుక్రవారం పరిశీలించారు. ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించిన వారు బ్యారేజ్ ఎత్తు, కాల్వల సామర్థ్యం, నీటి నిల్వలపై ఇరిగేషన్ అధికారుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తుమ్మిడిహెట్టి పుష్కర ఘాట్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రులు మాట్లాడారు. ప్రాణహిత బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తరపున ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్కు లేఖ రాశారని తెలిపారు. వచ్చే వారం మహారాష్ట్ర సీఎంతో సమావేశమై బ్యారేజ్ ఎత్తును ఖరారు చేసే దిశగా చర్చలు జరుపుతామని పేర్కొన్నారు. మహారాష్ట్రలో ముంపు ప్రభావిత ప్రాంతాల రైతులకు తగిన నష్ట పరిహారం అందించి వారిని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. గత కేసీఆర్ ప్రభుత్వం ప్రాణహిత ప్రాజెక్టు ను మేడిగడ్డకు తరలించడం ద్వారా తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. ఈ సమావేశంలో సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్, బెల్లంపల్లిఎమ్మెల్యే జి.వినోద్, జిల్లా కలెక్టర్ హరిత, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, అదనపు కలెక్టర్ డేవిడ్, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఆకాశవాణి ఆదిలాబాద్ జిల్లాకు గొప్ప వరం

- **ప్రభుత్వ పథకాల ప్రచారంలో రేడియో పాత్ర అమోఘం**
- **90 ఏళ్ల సేవలకు కలెక్టర్ రాజర్షిషా ప్రశంసలు**




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఆకాశవాణి కీలకపాత్ర పోషిస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం స్థానిక ఆకాశవాణి కేంద్రం 90 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన వాక్థాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆకాశవాణి కేంద్రం నుంచి గాంధీ పార్క్ వరకు నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా చరిత్రలో ఆకాశవాణికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. దేశంలో తొలినాళ్లలో ప్రారంభమైన మొదటి మూడు ఆకాశవాణి కేంద్రాల్లో ఆదిలాబాద్ కేంద్రం ఒకటిగా నిలవడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. అప్పటి నుంచి ఆకాశవాణి ప్రజలకు సమాచారాన్ని చేరవేస్తూ విశేష సేవలు అందిస్తోందని కొనియాడారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్, ఆరోగ్య పాఠశాల, కేవీకే ద్వారా అందిస్తున్న పథకాలను గిరిజన, మారుమూల గ్రామాల ప్రజలకు చేరవేయడంలో ఆకాశవాణి సేవలు అమోఘమని తెలిపారు. టీవీలు, వార్తా పత్రికలు చేరని ప్రాంతాల్లో కూడా రేడియో సమాచార వారధిగా పనిచేస్తోందన్నారు. జిల్లాలోని ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించడంలో ఆకాశవాణి విశేష పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. గిరిజన కళలు, ఆర్మెవ్నా రాబోయే రోజుల్లో జిల్లా స్థాయి కార్యక్రమాల్లో ప్రజలకు ప్రదర్శించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా యంత్రాంగం తరపున ఆకాశవాణికి ఎల్లప్పుడూ పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆదిలాబాద్కు చెందిన ఇప్ప పువ్వు లడ్డు ప్రస్తావన రావడంతో ఈ ప్రాంత ప్రత్యేకత దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. ఒక చిన్న గొంతుక ఆకాశవాణి ద్వారా దేశమంతా వినిపించడం గొప్ప విషయమని వ్యాఖ్యానించారు. ఆకాశవాణి 90 ఏళ్ల సేవల సందర్భంగా ఉద్యోగులు, కళాకారులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. అనంతరం ఆకాశవాణి అధికారులు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి రమేశ్వర్, సుమన్పతి రెడ్డి, యాంకర్లు లెనిన్, శ్రోతలు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం పేరిట గత ప్రభుత్వం వృథా ఖర్చు

- తుమ్మిడిహెట్టి పునరుద్ధరణకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ కృషి
- మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలోనే చర్చలు
- తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి సహకరించాలి
- ఇటు ప్రధాని నరేంద్ర మోదీ, అటు మహారాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి
- తుమ్మిడిహెట్టి ప్రాజెక్ట్ ప్రతిపాదిత ప్రాంతాన్ని క్షేత్ర స్థాయిలో సందర్శించిన మంత్రులు
- ప్రాణహిత నదికి జలహారతి పట్టిన మంత్రులు జూపల్లి, వివేక్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** తెలంగాణలో సాగునీటి రంగానికి పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ఇందిరమ్మ ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం తుమ్మిడిహెట్టిని సందర్శించిన మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి ప్రాణహిత నదికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, జలహారతి ఇచ్చారు. తుమ్మిడిహెట్టి ప్రతిపాదిత సైట్ ను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. బరాజ్ ఎత్తు, సామర్థ్యం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టి న పనులు, మహారాష్ట్ర లో ఉన్న శివిని గ్రామ పరిధిలోని ముంపు పరిధి, అటవీ, పర్యావరణ అనుమతులు, తదితర అంశాలపై సాగునీటి పారుదల శాఖ అధి కారులతో చర్చించారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలకులు పక్కనబెట్టి న ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు (తుమ్మిడిహెట్టి బరాజ్) పునరుజ్జీవం పోయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2008లో రూ.38,500 కోట్ల అంచనా వ్యయంతో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో డా. బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుకు భూమిపూజ చేశారని గుర్తుచేశారు. "అప్పట్లోనే 106 కి.మీ మేర కెనాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి, 71.5 కి.మీ మేర భూసేకరణ పూర్తి చేశారని, 46 కి.మీ మేర పనులు కూడా పూర్తయ్యాయని వెల్లడించారు. అయితే, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ను పక్కనబెట్టి, కాళేశ్వరం పేరుతో లక్షల కోట్లు ఖర్చు చేసి ఖజానాకు భారీ గండి కొట్టింది అని మండిపడ్డారు.గ్రావిటీ ద్వారా నీటిని మళ్లించే అవకాశం ఉన్నా, గత ప్రభుత్వం పంపుల ద్వారా నీటిని ఎత్తిపోయడంతో ఆర్థిక భారం పెరగడమే కాకుండా విద్యుత్ బిల్లులు కూడా భారంగా మారాయని మంత్రి ధ్వజమెత్తారు. మేడిగడ్డ ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగిపోవడంతో ఇప్పుడు ఆ నీటిని వాడుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మిస్తే ఒక్క యూనిట్ విద్యుత్ ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని తరలించవచ్చని, తద్వారా సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు రైతాంగానికి గొప్ప మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద 150 మీటర్ల మేర బరాజ్ నిర్మాణానికి అంగీకరించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరనున్నట్లు మంత్రి చెప్పారు. "మహారాష్ట్రలోని శివిని గ్రామానికి ఎలాంటి ముంపు సమస్య ఉండదు. భూములు కోల్పోయే వారికి మెరుగైన పరిహారం, సదుపాయాలు కల్పిస్తాం. ఈ ప్రాజెక్టు వల్ల రెండు రాష్ట్రాల్లోనూ భూగర్భ జలాలు పెరుగుతాయి" అని వివరించారు.

**బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు చొరవ చూపాలి**

ఈ నెల 10న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు రానున్న నేపథ్యంలో, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు ఈ ప్రాజెక్టు అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి జూపల్లి కోరారు. 'వికసిత్ భారత్' అని నినదించే కేంద్ర ప్రభుత్వం, పెద్ద మనసుతో తెలంగాణ రైతుల పక్షాన నిలబడి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

**రాజకీయాలకు తావులేదు**

రాష్ట్ర ప్రజల ప్రయోజనాల దృష్ట్యా చేపడుతున్న ఈ ప్రాజెక్టు విషయంలో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. సాగునీటి రంగాన్ని గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, అందరూ సహకరించాలని కోరారు. కమిషన్ ల కోసం కెసిఆర్ ప్రాణహిత తరలించారు కెసిఆర్ ఓ తుగ్లక్ సీఎం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారనీ రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు.ప్రాణహిత ప్రాజెక్టు ను కెసిఆర్ కమిషన్ల కోసమే తుమ్మిడి హెట్టి నుండి కాళేశ్వరం కు తరలించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కు తీవ్ర అన్యాయం చేశారని అన్నారు.కేసీఆర్ తుగ్లక్ సీఎం అని, బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆరోపించారు.కెసిఆర్ హయాంలో చిన్న కాంట్రాక్టర్ మేఘా కృష్ణారెడ్డి ప్రపంచ స్థాయి కి ఎదిగారని ఎద్దేవా చేశారు. మహారాష్ట్ర తో తుమ్మిడి హెట్టి ఒప్పందం చేసుకుని కాళేశ్వరం కట్టారని , పదివేల కోట్లు ఖర్చు చేసిన దానికి ఇరవై అయిదు వేల కోట్లిస్తే కంప్లీట్ అయ్యేదని , లక్ష కోట్ల తో కాళేశ్వం కడితే ఒక్క టీఎంసీ కూడా సరిగ్గా వాడలేదన్నారు.ప్రాణహిత ప్రాజెక్ట్ తో 16లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని ,ఉమ్మడి ఆదిలాబాద్ కి 2 లక్షల ఎకరాలకు సాగు నీరు ఇచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని ,తుమ్మిడి హెట్టి ప్రాజెక్ట్ నిర్మాణం తో మహారాష్ట్రకు ఎటువంటి నష్టం లేదని స్పష్టం చేశారు. మహా సీఎం ఫడ్నవీస్ ఒప్పుకోవాలని ,త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి ప్రాణహిత ప్రాజెక్ట్ కు శంకుస్థాపన చేస్తారని తెలిపారు.మహారాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకునేలా తెలంగాణా బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కృషి చేయాలి రైతులకి న్యాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, పాల్వాయి హరీష్ బాబు, కలెక్ట ర్ హరిత, ఎస్పీ నిఖిత పంత్ తదితరులు పాల్గొన్నారు.





# గ్రామపంచాయతీల్లో చలివేంద్రాల ఏర్పాటు



**ఉద్యమ కెరటం, తాండూర్:** వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మండలంలోని రాజీవ్నగర్, తాండూర్, గోపాల్నగర్ గ్రామపంచాయతీల్లో శుక్రవారం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల సర్పంచులు ఈ చలివేంద్రాలను ప్రారంభించి ప్రజలకు చల్లని తాగునీటి సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండుతున్న ఎండల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామస్తులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్దబోయిన శంకర్, రాజీవ్నగర్ గ్రామ సర్పంచ్ మామిడాల లలితా రాజేశం, తాండూర్ గ్రామ సర్పంచ్ ముడిమడుగుల సురేష్, గోపాల్నగర్ గ్రామ సర్పంచ్ గాట్ల నరసయ్య, నాయకులు గాజుల రామ్మోహన్, మాస వెంకటస్వామి, వార్డు సభ్యులు ఎండీ జుబేర్, గజ్జెల గోవర్ధన్, గాజుల సురేష్, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సన్మానం





**ఉద్యమ కెరటం, వరంగల్:** వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో నూతనంగా నిర్మించిన కట్టమైసమ్మ తల్లి దేవాలయం ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, సీనియర్ న్యాయవాది, అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పట్ట ణ కాంగ్రెస్ యువనాయకుడు పాలకుర్తి శ్రీకాంత్ వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు దేవాలయ అభివృద్ధికి సహకరించిన వారిని అభినందించారు. భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అనుగుణంగా ఆలయ నిర్మాణం జరగడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజలంతా ఐకమత్యంతో పండుగలను, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రైతు పక్షపాతిగా పనిచేస్తా

- ఆదిలాబాద్ వ్యవసాయ మారెకట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రైతుల సంక్షేమమే లక్ష్యంగా రైతు పక్షపాతిగా పనిచేస్తానని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన బోరంచు శ్రీకాంత్ రెడ్డిని శుక్రవారం ఆయన నివాసంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు, పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో ప్రారంభం కానున్న వర్షాకాల సీజన్ను దృష్టిలో ఉంచుకుని మార్కెట్ యార్డులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మార్కెట్ యార్డులో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ పనుల్లో పారదర్శకత పెంచేందుకు కిందిస్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికారుల వరకు అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని తెలిపారు. ప్రతి అధికారి రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించేలా పర్యవేక్షిస్తామని చెప్పారు. మార్కెట్కు వచ్చే ప్రతి రైతుకు గిట్టుబాటు ధర దక్కేలా కృషి చేస్తామని, మోసాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ రైతుకూ అన్యాయం జరగకుండా అండగా ఉంటామని రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు భీంరెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీకర్ గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# 'ఇందిరమ్మ' పథకంలో పేదల జీవితాల్లో వెలుగులు

## సర్పంచ్ ఆడే శీల రాజేశ్వర్



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ గృహ పథకం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందని గుడిహత్నూర్ సర్పంచ్ ఆడే శీల రాజేశ్వర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో శుక్రవారం ఆమె పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గతంలో ఇందిరమ్మ ఇళ్లు పేదలకు ఎంతగానో అండగా నిలిచాయని, ప్రస్తుతం ముఖ్యమంత్రి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అదే స్ఫూర్తితో ప్రతి అర్హుడికి సహాయం అందిస్తోందన్నారు. గ్రామంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. పథకం అమలులో పారదర్శకత పాటిస్తూ పేదల అవసరాలను గుర్తించి ప్రభుత్వం నిధులు విడుదల చేయడం అభినందనీయమన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని స్థానికులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రవి, సమీర్ ఖాన్, కేంద్రే బాలు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రిమ్స్ ఆడిటోరియంలో ఘనంగా రైతు వారోత్సవాలు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టి న99 రోజుల కార్యాచరణ, ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ ఆడిటోరియంలో రైతు వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ప్రత్యేక అతిథిగా మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. చెరువుల అభివృద్ధి, చేప పిల్లల పంపిణీ, మత్స్య సంపద పెంపు ద్వారా మత్స్యకార కుటుంబాలకు ఉపాధి అవకాశాలు విస్తరిస్తున్నాయని తెలిపారు. మత్స్యకారులు ఆధునిక పద్ధతులను అవలంభించి ఉత్పత్తి పెంచుకోవాలని, తద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు కృషి చేయాలని కోరారు. మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం మత్స్యకారులకు చేప పిల్లలను పంపిణీ చేశారు. చేపల వ్యాధి నిర్ధారణ, ఉత్పత్తి పెంపుపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అవగాహన



**ఉద్యమ కెరటం, వాంకిడి :** మండల కేంద్రంలోని ఖిరీడీ గ్రామంలో నిర్వహించిన 'రైతు ముంగింట్లో శాస్త్రవేత్తలు' అవగాహన సదస్సులో ప్రొఫెసర్ అనురాధ, సౌజన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు అధికంగా యూరియా వాడటం తగ్గించాలని, భూసార రక్షణకు పంట మార్పిడి పద్ధతులు పాటించాలని సూచించారు. పచ్చిరొట్ట ఎరువుల వినియోగం పెంచాలని, పంట వ్యర్థాలను కాల్చకుండా వేసవి దుక్కుల్లో కలియదున్నాలని కోరారు. నిషేధిత మందుల వాడకం వల్ల కలిగే నష్టాలు, నీటి యాజమాన్యం, సేంద్రీయ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ ఒమాజీ, ఏఈఓ శంకర్, అరవింద్, సర్పంచ్ అమృత, ఉప సర్పంచ్ సాగర్, గ్రామ పటేల్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్' పై అవగాహన

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** మండలంలోని రాజంపేట గ్రామపంచాయతీలో శుక్రవారం బి.ఎల్.ఓ రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఎస్.ఐ.ఆర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గులాం జావిద్ పాల్గొని, స్వయంగా ప్రజలకు ఈ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# కాగజ్‌నగర్ పేపర్ మిల్లును సందర్శించిన మంత్రి జూపల్లి



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్ :** పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం కాగజ్‌నగర్‌లోని పేపర్ మిల్లును సందర్శించారు. ఈ సందర్భంగా మిల్లు సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం మిల్లు లోని వివిధ విభాగాలను మంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. కలప నుంచి కాగితం తయారయ్యే వివిధ దశలను మంత్రి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కలపను ముక్కలుగా చేయడం (చిప్పింగ్), ఆపై గుజ్జుగా మార్చడం, రసాయనాల వినియోగం నుంచి తుది దశలో పేపర్ రోల్స్ సిద్ధమయ్యే వరకు సాగే సంక్లిష్ట ప్రక్రియను, యంత్రాల పనితీరును మిల్లు సాంకేతిక నిపుణులు ఆయనకు వివరించారు. ,ఉత్పత్తి, కార్మికుల సంక్షేమం తదితర అంశాలపై ఆయన చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె హరిత ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# బెజ్జాల గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం

**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల బెజ్జాల గ్రామంలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 25 మంది రైతులకు చెందిన పశువులకు, మరో ఆరుగురు రైతులకు చెందిన మేకలకు ఉచిత వైద్య చికిత్స అందించారు. అవసరమైన మందులను పంపిణీ చేశారు. అనంతరం పశువైద్యులు వేసవి కాలంలో పశువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. పశువులకు తగినంత నీరు, పోషకాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మడావి ప్రాబత్ రావు, ఉప సర్పంచ్ మడావి పర్వత్ రావు, తాండూర్, రేచిని పశువైద్యులు డాక్టర్ పీవీ నరసింహారావు, డాక్టర్ శివప్రసాద్, వార్డు సభ్యుడు తొడసం బాదు, పశువైద్య సిబ్బంది కళ్యాణ్, సాయికుమార్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



# తుమ్మల రాజకీయ ప్రస్థానానికి 40 ఏళ్లు

## సత్తుపల్లిలో ఘనంగా వేడుకలు

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ ప్రస్థానానికి 40 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు ప్రభుత్వంలో తొలిసారిగా మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నాటి నుంచి నాలుగు దశాబ్దాల ప్రజాసేవను గుర్తు చేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఆధ్వర్యంలో నిర్వహించగా, రాష్ట్ర యువ నాయకుడు తుమ్మల యుగంధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ సేవలను కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలు రాజకీయ కుట్రలో భాగంగా అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ప్రజలు చేపడుతున్న గృహ నిర్మాణాలకు మట్టి, ఇసుక అవసరం సహజమని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు ప్రజలకు ఇళ్లు ఇవ్వకుండానే అక్రమ మట్టి, ఇసుక రవాణా ద్వారా భూములను దోచుకున్నాయని ఆరోపించారు. తాము రాజకీయాల్లో కి రాకపోయి ఉంటే వైద్యులుగా కోట్ల రూపాయలు సంపాదించే వారమని, ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చామని తెలిపారు. "మాకు ఉన్నదాంట్లో పేద



ప్రజలకు సహాయం చేయడం మాత్రమే తెలుసు.. తీసుకోవడం తెలియదు.. మా ఇంట్లో అవినీతికి చోటు లేదు" అని స్పష్టం చేశారు. రాజకీయంగా ఎదుర్కోలేక కొందరు అవినీతి ఆరోపణలు చేస్తున్నారని, ప్రజలకు తమ నిజాయితీ తెలుసని పేర్కొన్నారు. "ప్రజా సేవకే మా జీవితం అంకితమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కల్లూరు ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, ఐదు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మహిళా, యువజన, ఎన్ఎస్యూఐ నాయకులు, డీసీసీ నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, కౌన్సిలర్లు , కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యువ నాయకులకు పార్టీలో కీలక పాత్ర

## రాష్ట్ర మంత్రి సీతక్క

**ఉద్యమ కెరటం, ములుగు:** యువ నాయకులకు పార్టీలో కీలకపాత్ర ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ములుగు జిల్లా చల్వాయిలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు మారం సుమన్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన యువజన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చేస్తున్న కృషిని అభినందించారు. ఇటీవల జరిగిన అన్ని ఎన్నికల్లో యువ నాయకులు ఎంతో కష్టపడి పార్టీ



విజయానికి కృషి చేశారని కొనియాడారు. కష్టపడ్డ ప్రతీ యువ నాయకుడికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని, భవిష్యత్తులో యువజన కాంగ్రెస్ నాయకులకు కీలక బాధ్యతలు దక్కుతాయని తెలిపారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో యువ నాయకులకు అవకాశాలు కల్పించామని, సర్పంచులుగా గెలుపొందిన వారిని అలాగే వివిధ మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికైన వారిని శాలువాలతో సత్కరించి అభినందించారు. యూత్ కాంగ్రెస్ అంటే క్రమశిక్షణకు ప్రతీక అని, పార్టీ కోసం కష్టపడిన ప్రతిఒక్కరినీ కాంగ్రెస్ పార్టీ గుర్తిస్తుందని చెప్పారు. గతంలో యువజన కాంగ్రెస్లో కీలకంగా పనిచేసిన పలువురికి నామినేటెడ్ పదవులు కూడా కల్పించినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సూర్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, రవాణా శాఖ స్టేట్ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్ల పల్లి రాజేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ ఇంచార్జి రాకేష్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ పల్లె జైపాల్ రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్, వివిధ మండలాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిర్పూర్లో పోడు రైతుల కమిటీ ఏర్పాటు

**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** సిర్పూర్ నియోజకవర్గంలోని చింతలమానేపల్లి మండలంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పోడు రైతుల కమిటీని ఏర్పాటు చేశారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు గోమాసె లాంచ్ ఆధ్వర్యంలో ఈ కమిటీ నిర్మాణ కార్యక్రమం చేపట్టారు. పోడు భూముల కమిటీని



ఏర్పాటు చేసి అధ్యక్షుడిగా దుర్గం బాపురావు, కార్యదర్శిగా తోటపల్లి నారాయణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు గోలేం వెంకటేశం మాట్లాడుతూ కార్జెల్లి శివారులో పేద రైతులు సాగు చేస్తున్న 170 ఎకరాల భూమిలో 70 ఎకరాలను ఫారెస్ట్ అధికారులు కంచె పేరుతో స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే హరీష్ బాబు స్పందించకపోవడం బాధాకరమని విమర్శించారు. ఎన్నికల ముందు పోడు రైతులకు పట్టాలు ఇప్పిస్తామని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను పట్టించుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కేసీఆర్ పోడు రైతులకు ఆర్ఓఎఫ్ఆర్ చట్టం కింద పట్టాలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ పోడు రైతులకు హక్కు పత్రాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రతి పోడు రైతుకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సిర్పూర్ నియోజకవర్గ యూత్ కన్వీనర్ కాసిపాక రాజు, కార్జెల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు రౌతు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

**ఉద్యమ కెరటం, హత్నూర:** పశువుల ఆరోగ్యంపై రైతులు, పశుపోషకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ సంధ్యారాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని హత్నూర గ్రామ పశువైద్యశాల ఆవరణలో 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పాడి రైతులకు పశు చికిత్స, సంరక్షణపై అవగాహన కల్పించేందుకు సమగ్ర పశు చికిత్స అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ నల్లోల్ల ఎల్లయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాడి రైతులు, గొర్రెల కాపరులకు దూడల పెంపకం,



వేసవిలో పశు సంరక్షణ, పచ్చిగడ్డి రకాల పెంపకం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. శిబిరంలో 36 దూడలకు నట్టల నివారణ మందులు, 3 టీకాలు అందించగా, 17 గర్భకోశ వ్యాధులకు, 12 పశువులకు చర్మవ్యాధుల చికిత్సలు, ఇతర వ్యాధులకు వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. పాడి పశువుల కోసం తాగునీటి తొట్లు ఏర్పాటు చేయాలని పశువైద్యాధికారి కోరగా, సర్పంచ్ నల్లోల్ల ఎల్లయ్య సానుకూలంగా స్పందించి త్వరలోనే గ్రామంలో పశువులకు తాగునీటి సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చెక్క మానస రవీందర్ గౌడ్, డాక్టర్ భాగ్యలక్ష్మి, రాజ మల్లయ్య, సంగమేశ్వర్ రెడ్డి, స్వరూప, రాజిరెడ్డి, గోపాలమిత్ర సుధాకర్, పశువైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్తోనే సొంతింటి కల సాధ్యం

## డీసీసీ వైస్ ప్రెసిడెంట్ దీపక్ రావు

**ఉద్యమ కెరటం, భోరజ్:** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కాంగ్రెస్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ దీపక్ రావు అన్నారు. భోరజ్ మండల పరిధిలోని సావాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి నివాస గృహం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. కొత్త ఇళ్ల లో లబ్ధిదారులు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శాంతన్ రావు, సీనియర్ నాయకులు భూమా రెడ్డి, రామారెడ్డి, సీనియర్ నాయకులు శంకర్, పోట అశోక్, నాయకులు



కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రామీణ ఆర్థికాభివృద్ధిలో పశుపోషణే కీలకం

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంలో పశుపోషణ కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం బేల మండలం సిరిసన్న గ్రామంలో పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమగ్ర పశుసంవర్ధక చికిత్స, అవగాహన, 'మేలు జాతి దూడల ప్రదర్శన' కార్యక్రమానికి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్ట ర్, ఎమ్మెల్యే, అధికారులు గోమాతకు పూజలు నిర్వహించి వివిధ జాతుల పశువుల ప్రదర్శనను, మందుల స్టాళ్లను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పశుసంవర్ధకంపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మేలు జాతి దూడలను శాస్త్రీయ పద్ధతుల్లో పెంచడం ద్వారా పాల దిగుబడి పెరిగి రైతులకు అధిక లాభాలు వస్తాయని తెలిపారు. పశుసంవర్ధక శాఖ అందిస్తున్న కృత్రిమ గర్భధారణ వంటి ఆధునిక సౌకర్యాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. దూడలు పుట్టి నప్పటి నుంచి సరైన పోషకాహారం, సకాలంలో టీకాలు ఇవ్వడం ద్వారా ఆరోగ్యకరమైన పాడి సంపదను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ పాడి రైతులకు అన్ని విధాలా అండగా ఉండటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న మేలు రకం గడ్డి విత్తనాలు, గడ్డి కటింగ్ మిషన్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిరుద్యోగ యువత పాడి పరిశ్రమను ఉపాధి మార్గంగా ఎంచుకోవాలని సూచించారు. అంతకుముందు పశువైద్య అధికారులు రైతులకు సబ్సిడీ పథకాలు, టీకాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అనంతరం ఉత్తమంగా పెంచిన ముర్రా గేదె దూడలు, దేశీవాళీ ఆవు దూడల యజమానులకు కలెక్ట ర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా పాల క్యాన్లను బహుమతులుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ రామారావు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, బేల వ్యవసాయ అధికారి సాయితేజా, బేల పశువైద్య అధికారి దీప్ రథన్, ఎంపీఓ మహేష్, సర్పంచ్ కాత్యం పొచక్క, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్వీయ గణనతో జనగణన సులభతరం

## జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జనగణన–2027లో భాగంగా స్వీయ గణన విధానం ద్వారా జనగణన కార్యక్రమం మరింత సులభతరం అవుతుందని జిల్లా అదనపు కలెక్ట ర్(స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తా నుంచి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వరకు నిర్వహించిన మారథాన్ వాక్ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్ట ర్ (రెవెన్యూ) వి.రాములు, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా యువజన క్రీడా సేవల అధికారి హనుమంత రెడ్డి, జిల్లా ఉప గణాంక అధికారి రాజేందర్ తదితరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీయ గణనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మారథాన్ వాక్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రజలను స్వీయ గణనలో భాగస్వాములు కావాలని కోరుతూ నినాదాలు చేశారు. "మన వివరాలు మనమే నమోదు చేద్దాం", "స్వీయ గణనతో జనగణన సులభతరం" అనే సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఖచ్చితమైన జనాభా గణాంకాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ, అభివృద్ధి పథకాల రూపకల్పనకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజలు స్వీయ గణన సదుపాయాన్ని వినియోగించుకుని ఈనెల 10వ తేదీలోగా తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ స్వీయ గణన పూర్తి చేసి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం సభ్యులు స్వీయ గణనపై అవగాహన పాటలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, యువత, ప్రజలు పాల్గొన్నారు.

# రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం

## ఎంపీ గడ్డం వంశీకృష్ణ



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని, రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని పెద్దపల్లి పార్లమెం ట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా గోడ కూలి రైతులు మృతి చెందిన ఘటన స్థలాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, లక్సెట్టిపేట తహశీల్దార్ దిలీప్ కుమార్, డీసీసీ ప్రతినిధి రఘునాథ్ రెడ్డి, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా లక్సెట్టిపేట మండలం కొత్తూరులోని కొనుగోలు కేంద్రంలో జరిగిన ప్రమాదంలో రైతులు మృతి చెందడం బాధాకరమన్నారు. రైతుల సమస్యల పరిష్కారంలో భాగంగా రవాణా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొత్తూరు కొనుగోలు కేంద్రానికి సంబంధించిన ధాన్యాన్ని నెల్కివెంకటాపూర్ గోదాముకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. అకాల వర్షాల్లో మృతి చెందిన కొత్తూరు గ్రామానికి చెందిన వెంకటేష్ కుటుంబాన్ని, గంపలపల్లి గ్రామానికి చెందిన తండ్రి–కొడుకులు తనుగుల నాగరాజు, అభిరామ్ కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం దండేపల్లి మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన నెల్కి లచ్చన్న కుటుంబాన్ని జిల్లా కలెక్ట ర్ కుమార్ దీపక్, తహశీల్దార్ రోహిత్ దేశ్పాండేతో కలిసి పరామర్శించి ప్రభుత్వం అన్నివిధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంతకుముందు లక్సెట్టిపేట మండలంలోని మిట్టపల్లి గ్రామంలో ఉన్న శ్రీరామకృష్ణ ట్రేడర్స్ రైస్ మిల్లును సందర్శించి లారీలు, హమాలీల సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం లారీలతో పాటు ట్రాక్ట ర్ల ద్వారా ధాన్యం రవాణాకు అనుమతి ఇచ్చిందని, లారీ యజమానులు, హమాలీలు సహకరించి ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ సూచనలకు హమాలీలు, లారీ నిర్వాహకులు సానుకూలంగా స్పందించడంతో పరిస్థితి అనుకూలంగా మారింది. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలో నిర్వహించనున్న ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్ట ర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్యతో కలిసి జూమ్ మీటింగ్ ద్వారా సంబంధిత శాఖల అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 13 నుంచి 20వ తేదీ వరకు జరిగే పరీక్షల కోసం జిల్లాలో 14 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాదాపు 5వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, సరిపడా ఫర్నిచర్, మూత్రశాలలు వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. వేసవి దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపాలని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా చర్యల్లో భాగంగా 163 బీఎన్ఎస్ఎస్ అమలు చేయాలని సంబంధిత తహశీల్దార్లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, వైద్య సిబ్బంది అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో అందుబాటులో ఉండాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల కోసం అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పోలీసు భ ద్రత ఏర్పాటు చేయాలని, ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాలను పూర్తి బందోబస్తుతో తరలించాలని తెలిపారు. పరీక్షల పర్యవేక్షణ కోసం ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించాలని పేర్కొన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సర్పంచ్ చొరవతో తీరిన మంచినీటి కష్టాలు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని వడూర్ గ్రామంలో గత కొన్ని రోజులుగా నెలకొన్న మంచినీటి సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న బోరు బావి మోటారు అకస్మాత్తుగా పాడవడంతో నీటి సరఫరా నిలిచిపోయి గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండటంతో ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్న విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ వెంటనే స్పందించారు. గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చొరవతో కొత్త మోటారును తెప్పించి యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయించారు. కొత్త మోటారు ఏర్పాటు అనంతరం నీటి సరఫరా పునరుద్ధరించబడడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించిన సర్పంచ్ శ్రీకాంత్కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్ట ర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హాజీపూర్ మండలంలోని గుడిపేట, సబ్బపల్లి, గొల్లపల్లి, పెద్దంపేట, దొనబండ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మండల తహశీల్దార్ పుష్పలతతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తోందన్నారు. హాజీపూర్ మండలంలో 20 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి నగదు చెల్లింపులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం గోదాముల్లో నిల్వ చేయాలని పేర్కొన్నారు. లారీలు అందుబాటులో లేని ప్రాంతాల్లో ట్రాక్ట ర్లద్వారా ధాన్యం రవాణాకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 12 రైస్ మిల్లులు, 6 గోదాములు అందుబాటులో ఉన్నాయని, సుముఖ గోదాం సామర్థ్యం 35వేల మెట్రిక్ టన్నులు ఉందని తెలిపారు. దాదాపు 50 మంది హమాలీలతో ధాన్యం దిగుమతి, నిల్వ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. రోజుకు 15 లారీలు రావాల్సి ఉండగా, ప్రస్తుతం 12 లారీల ధాన్యం దిగుమతి అవుతోందని, ఇప్పటి వరకు 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ నెలాఖరు నాటికి 80 శాతం కొనుగోళ్లు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రైతులు తేమ, మట్టి గడ్డలు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని వ్యవసాయ విస్తరణ అధికారుల ధ్రువీకరణతో కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో కోతలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మిల్లింగ్ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రవాణా, అన్లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జైపూర్ మండలంలోని ఆగ్రో ఇండస్ట్రీస్ గోదామును సందర్శించి ధాన్యం నిల్వ సదుపాయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఈనెల 20న మెగా జాబ్ మేళా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈనెల 20న ఆదిలాబాద్లో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6న నిర్వహించిన జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించడంతో అదే ఉత్సాహంతో మరో మెగా జాబ్ మేళాను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మావలలోని చిలుకూరిలక్ష్మి గార్డెన్స్లో ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఐటీ, సర్వీస్ సెక్టార్, అగ్రికల్చర్, మ్యానుఫ్యాక్చరింగ్, కాల్ సెంటర్స్ తదితర రంగాలకు చెందిన 50కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని 5వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయని వివరించారు. 18 నుంచి 33 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకులు ఈ జాబ్ మేళాకు హాజరుకావచ్చని, అభ్యర్థుల అర్హతలను బట్టి ఏడాదికి రూ.1.5లక్షల నుంచి రూ.4లక్షల వరకు వేతన ప్యాకేజీలు లభించే అవకాశముందని తెలిపారు. ఆసక్తి గల వారు పోస్ట ర్లో పొందుపరిచిన క్యూ ఆర్ కోడ్ను స్కాన్ చేసి ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. బయోడేటా, సీవీలతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. ఇతర వివరాల కోసం హెల్ప్లైన్ నంబర్లు 9666612707, 7981255978లపై సంప్రదించాలని సూచించారు.

# వెంకటాపూర్లో ఉచిత పశువైద్య శిబిరం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో 99 రోజుల కార్యాచరణపై అవగాహన కార్యక్రమంతో పాటు ఉచిత పశువైద్య చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారులు 5 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు నిర్వహించారు. అదేవిధంగా 32 దూడలు, 25 పశువులు, 450 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేసి వ్యాధి నిరోధక చర్యలు చేపట్టారు. పశువులకు సాధారణ వైద్య సేవలు అందించడంతో పాటు పశుగ్రాస కొరత నివారణకు రైతులకు రాయితీపై పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ రూపావత్ కృష్ణానాయక్ మాట్లాడుతూ రైతులు పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి రాథోడ్ జీవన్, విఎల్ డి పెంటన్న, ఓఎస్ రాజన్న, రైతులు, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# చెన్నై వీధుల్లో సీఎస్‌కే స్టార్ల సందడి

**ఆటోలో షికారు.. పిల్లలతో గల్లీ క్రికెట్**

**చెన్నై, మే 8 :** ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ఉన్న అభిమానమే ప్రత్యేకం. తాజాగా ఆ జట్టుకు చెందిన యువ విదేశీ ఆటగాళ్లు డెవాల్డ్ బ్రెవిస్, నూర్ అహ్మద్ చెన్నై నగర వీధుల్లో చేసిన సందడి అభిమానులను ఆకట్టుకుంటోంది. స్టార్ క్రికెటర్ల హంగులు పక్కనపెట్టి సామాన్యుల్లా నగరాన్ని చుట్టేస్తూ అభిమానులతో కలిసిపోయారు. మ్యాచ్‌ల మధ్యలో దొరికిన విరామ సమయంలో ఈ ఇద్దరు ఆటగాళ్లు ఖరీదైన కార్లను వదిలేసి ఆటో రిక్షాలో ప్రయాణించారు. చెన్నై వీధుల్లో ఆటోలో కనిపించిన వారిని చూసి అభిమానులు ఆశ్చర్యపోయారు. స్థానిక సంస్కృతిని ఆస్వాదిస్తూ వారు చేసిన ఈ ప్రయాణం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అక్కడితో ఆగకుండా ఓ స్థానిక మైదానానికి వెళ్లిన బ్రెవిస్, నూర్ అహ్మద్ అక్కడ క్రికెట్ ఆడుతున్న చిన్నారులతో కలిసి గల్లీ క్రికెట్ ఆడారు. చిన్నారులు బౌలింగ్ చేయగా బ్రెవిస్ సరదాగా షాట్లు ఆడుతూ అలరించాడు. అభిమానులతో చేతులు కలుపుతూ, ఫొటోలు దిగుతూ ఇద్దరూ సందడి చేశారు. తమ అభిమాన ఆటగాళ్లు ఇలా సాధారణ ప్రజల మధ్య కలిసిపోవడంతో సీఎస్‌కే అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియోలు, ఫొటోలు నెట్టింట విపరీతంగా వైరల్ అవుతున్నాయి.



## కోహ్లీ సలహానే అస్త్రంగా మార్చిన

# ప్రిన్స్ యాదవ్

**లక్నో, మే 8 :** ఐపీఎల్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో యువ పేసర్ ప్రిన్స్ యాదవ్ అందరి దృష్టిని ఆకర్షించాడు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని కేవలం రెండు బంతుల్లోనే డకౌట్ చేయడంతో ఈ యువ బౌలర్ పేరు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మ్యాచ్ అనంతరం ప్రిన్స్ చెప్పిన విషయాలు అభిమానులను మరింత ఆశ్చర్యానికి గురిచేశాయి. లక్ష్య ఛేదనలో విరాట్ కోహ్లీ సున్నాకే ఔటవడం గత తొమ్మిదేళ్లలో ఇదే తొలిసారి. చివరిసారిగా 2017లో కోల్‌కతా జట్టుపై కోహ్లీ డకౌట్ అయ్యాడు. ఏకనా స్టేడియంలో ప్రిన్స్ యాదవ్ వేసిన వేగవంతమైన ఇన్‌స్వింగర్‌కు కోహ్లీ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. మ్యాచ్ తర్వాత మాట్లాడిన ప్రిన్స్ యాదవ్ ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు. "గత మ్యాచ్ అనంతరం విరాట్ భయ్యా నాతో మాట్లాడారు. పిచ్‌పై బంతి సీమ్ అవుతున్నప్పుడు లెంగ్త్ మార్చకుండా ఒకే ప్రాంతంలో క్రమంగా బౌలింగ్ చేయాలని సూచించారు. ఈ రోజు అదే సలహాను పాటించాను. ఆయన చెప్పినట్టుగానే బంతులు వేయడంతో వికెట్ దక్కింది" అని తెలిపాడు. ప్రిన్స్ మాటలు ఇప్పుడు క్రికెట్ అభిమానుల్లో చర్చనీయాంశంగా మారాయి. గురువు ఇచ్చిన సలహానే శిష్యుడి ఆయుధంగా మారి చివరకు అదే కోహ్లీ వికెట్‌కు కారణమవడం విశేషంగా మారింది.

## వైభవ్‌పై ఇంగ్లండ్ దిగ్గజాల ప్రశంసలు



**లండన్, మే 8 :** టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్‌ను ఆశ్చర్యపరుస్తున్నాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే అరుదైన రికార్డులు సృష్టిస్తూ ఐపీఎల్‌లో బౌలర్లకు భయంకరంగా మారాడు. తాజాగా ఇంగ్లండ్ మాజీ క్రికెటర్లు కూడా వైభవ్ ఆటపై ప్రశంసల వర్షం కురిపించడం విశేషంగా మారింది. 'స్టిక్ టు క్రికెట్' అనే కార్యక్రమంలో పాల్గొన్న ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ ఫిల్ టఫ్నెల్ మాట్లాడుతూ.. వైభవ్ ఇదే ఫామ్ కొనసాగిస్తే 21 ఏళ్లకే అన్ని రికార్డులు సాధించి, భారీగా సంపాదించి రిటైర్ అయ్యే స్థాయికి చేరుకుంటాడని సరదాగా వ్యాఖ్యానించాడు. అతడి దూకుడు బ్యాటింగ్ చూస్తుంటే ప్రపంచ స్థాయి బౌలర్లకే భయం వేసేలా ఉందని చెప్పాడు. ఇక భారత ఆటగాళ్లపై తరచూ విమర్శలు చేసే మైఖేల్ వాన్ కూడా వైభవ్‌ను కొనియాడటం ఆసక్తికరంగా మారింది. క్రిస్ గేల్ లాంటి విధ్వంసకర ఆటగాడు కెరీర్ మధ్యలో 30 బంతుల్లో సెంచరీ చేస్తే.. వైభవ్ మాత్రం చిన్న వయసులోనే 35 బంతుల్లో శతకం బాదాడని ప్రశంసించాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఇప్పటికే 37 సిక్సర్లు కొట్టి బౌలర్లపై ఆధిపత్యం చాటుతున్నాడని పేర్కొన్నాడు. మరో మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్ కూడా వైభవ్‌ను ప్రపంచంలోనే అత్యుత్తమ సిక్సర్ల హిట్టర్‌గా అభివర్ణించాడు. డేవిడ్ లాయిడ్ సహా పలువురు మాజీ ఆటగాళ్లు కూడా వైభవ్ ప్రతిభను కొనియాడారు. మొత్తంగా ఇంగ్లండ్ దిగ్గజాలంతా ఒకే వేదికపై భారత యువ ఆటగాడిని ప్రశంసించడం ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది.

# ఫిన్ అలెన్ విధ్వంసం!

## కేవలం 47 బంతుల్లో అజేయ సెంచరీతో చెలరేగిన ఫిన్ అలెన్

**ఢిల్లీపై 8 వికెట్ల తేడాతో కేకేఆర్ ఘన విజయం**

**మొదట బ్యాటింగ్ చేసి 142 పరుగులకే పరిమితమైన క్యాపిటల్స్**

**34 బంతులు మిగిలి ఉండగానే కోల్‌కతా లక్ష్య ఛేదన**

**బౌలింగ్‌లో సత్తా చాటిన కార్తీక్ త్యాగి, అనుకుల్ రాయ్**







ఢిల్లీ (మనసులో మాట): ఐపీఎల్ లో భాగంగా శుక్రవారం అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ పై కోల్ కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి మొదట బౌలింగ్ ఎంచుకున్న కేకేఆర్ వ్యూహం ఫలించింది. బ్యాటింగ్, బౌలింగ్ లో సమష్టిగా రాణించి ఏకంగా 8 వికెట్ల తేడాతో ఢిల్లీని చిత్తు చేసింది. కేకేఆర్ ఆటగాడు ఫిన్ అలెన్ ఆకాశమే హద్దుగా చెలరేగి అజేయ సెంచరీతో జట్టుకు ఒంటిచేత్తో విజయాన్ని అందించాడు.

**తడబడ్డ ఢిల్లీ..**

మొదట బ్యాటింగ్ కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ కు కేకేఆర్ బౌలర్లు చుక్కలు చూపించారు. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి కేవలం 142 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఓపెనర్ పతుమ్ నిస్సాంక 29 బంతుల్లో 50 పరుగులతో ఆకట్టుకోగా.. చివర్లో అశుతోష్ శర్మ 28 బంతుల్లో 39 పరుగులు, కేఎల్ రాహుల్ 14 బంతుల్లో 23 పరుగులు చేసి జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించారు. కోల్ కతా బౌలర్లలో కార్తీక్ త్యాగి 4 ఓవర్లలో 25 పరుగులిచ్చి 2 వికెట్లు తీయగా.. అనుకుల్ రాయ్ 31 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టాడు. కామెరూన్ గ్రీన్ కు 1 వికెట్ దక్కింది.

**అలెన్ సుడిగాలి ఇన్నింగ్స్..**



స్వల్ప లక్ష్య ఛేదనలో కోల్ కతా ఎక్కడా తడబడలేదు. ఓపెనర్ ఫిన్ అలెన్ ఢిల్లీ బౌలర్లపై సుడిగాలిలా విరుచుకుపడ్డాడు. కేవలం 47 బంతుల్లోనే అజేయంగా 100 పరుగులు సాధించి ఢిల్లీ ఆశలపై నీళ్లు చల్లాడు. అతడికి తోడుగా కామెరూన్ గ్రీన్ 27 బంతుల్లో 33 పరుగులతో నాటౌట్ గా నిలిచి విజయానంతరమే పెవిలియన్ కు చేరాడు. అజింక్య రహానే 9 బంతుల్లో 13 పరుగులు చేశాడు. ఢిల్లీ బౌలర్లలో అక్షర్ పటేల్ కు మాత్రమే 1 వికెట్ దక్కింది. ముఖేష్ కుమార్ 0.2 ఓవర్లు బౌలింగ్ చేసి 7 పరుగులు ఇవ్వగా, లుంగీ ఎంగిడి 2 ఓవర్లలో 7 పరుగులు ఇచ్చాడు. ఫుల్ జోష్ లో ఆడిన కేకేఆర్ మరో 34 బంతులు మిగిలి ఉండగానే 14.2 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 147 పరుగులు సాధించి దర్జాగా విజయం సాధించింది.

# ఐపీఎల్‌లో బౌలర్లకు చుక్కలు

**అత్యంత ఖరీదైన స్పెల్స్ ఇవే!**




**ముంబై, మే 8 :** ఐపీఎల్ 2026 సీజన్‌లో బ్యాటర్లు విధ్వంసం సృష్టిస్తూ బౌలర్లకు చుక్కలు చూపిస్తున్నారు. ఇప్పటికే టోర్నీ 50 మ్యాచ్‌ల మైలురాయిని దాటేసిన నేపథ్యంలో భారీ స్కోర్లు సాధారణంగా మారిపోయాయి. ముఖ్యంగా కొందరు స్టార్ బౌలర్లు ఒకే మ్యాచ్‌లో భారీగా పరుగులు సమర్పించుకుని చెత్త రికార్డులు మూటగట్టుకున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు అత్యధిక పరుగులు ఇచ్చుకున్న టాప్-5 బౌలర్ల జాబితాలో పంజాబ్ కింగ్స్‌కు చెందిన ముగ్గురు బౌలర్లు ఉండటం విశేషం. జాబితాలో అగ్రస్థానంలో పంజాబ్ కింగ్స్ పేసర్ జేవియర్ బార్ట్లెట్ నిలిచాడు. ఏప్రిల్ 25న ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అతడు తన నాలుగు ఓవర్లలో ఏకంగా 69 పరుగులు ఇచ్చాడు. ఆ మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ అజేయంగా 152 పరుగులతో చెలరేగడంతో బార్ట్లెట్ బౌలింగ్ పూర్తిగా తేలిపోయింది. రెండో స్థానంలో టీమిండియా స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ఉన్నాడు. రాజస్థాన్ రాయల్స్‌తో ఏప్రిల్ 28న జరిగిన మ్యాచ్‌లో నాలుగు ఓవర్లలో 68 పరుగులు ఇచ్చి కేవలం ఒక వికెట్ మాత్రమే తీశాడు. స్వదేశీ మైదానంలోనే అతడు భారీగా పరుగులు సమర్పించుకోవడం అభిమానులను ఆశ్చర్యపరిచింది. మూడో స్థానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ యువ బౌలర్ సాకిబ్ హుస్సేన్ నిలిచాడు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అతడు నాలుగు ఓవర్లలో 62 పరుగులు ఇచ్చాడు. ఈ సీజన్‌లో కొన్ని మ్యాచ్‌ల్లో అద్భుతంగా రాణించిన సాకిబ్, పంజాబ్ బ్యాటర్ల దాడికి తట్టుకోలేకపోయాడు. నాలుగో స్థానంలో మరో పంజాబ్ కింగ్స్ బౌలర్ మార్కో యాన్సెన్ ఉన్నాడు. మే 6న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో నాలుగు ఓవర్లలో 61 పరుగులు ఇచ్చాడు. ఆ మ్యాచ్‌లో పంజాబ్ ఓటమికి బౌలర్ల వైఫల్యమే ప్రధాన కారణంగా మారింది. ఐదో స్థానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్ ప్రఫుల్ హింగే ఉన్నాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో ఏప్రిల్ 18న జరిగిన మ్యాచ్‌లో నాలుగు ఓవర్లలో 60 పరుగులు సమర్పించుకున్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఐదుగురు బౌలర్లు ఒక్క ఇన్నింగ్స్‌లో 60కిపైగా పరుగులు ఇచ్చుకోవడం టీ20ల్లో బ్యాటర్ల ఆధిపత్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.

# హనీ ట్రాప్ ప్రమాదంపై అప్రమత్తం

**ఐపీఎల్ ఆటగాళ్లకు బీసీసీఐ హెచ్చరిక..**



**ముంబై, మే 8 :** ఐపీఎల్ 2026 సీజన్ నేపథ్యంలో ఆటగాళ్లు, జట్టు సిబ్బందికి భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక హెచ్చరిక జారీ చేసింది. హనీ ట్రాప్ ఘటనలు జరిగే అవకాశాలు ఉన్నాయని అనుమానం వ్యక్తం చేస్తూ అన్ని ఫ్రాంచైజీలకు ప్రత్యేక మార్గదర్శకాలను పంపించింది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పంపిన లేఖలో ఆటగాళ్లు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హోటల్ గదుల్లోకి అనుమతి లేని వ్యక్తులను తీసుకురావద్దని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన ఆటగాళ్లపై సస్పెన్షన్ సహా కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.

ఏడు పేజీల మార్గదర్శకాల లేఖను అన్ని జట్లకు పంపినట్లు సమాచారం. ఆటగాళ్లు, సిబ్బందిపై నిఘా పెట్టేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఈ బృందంలో బీసీసీఐ మరియు ఐపీఎల్ ఆపరేషన్స్ విభాగాల సభ్యులు ఉంటారు. హోటల్ గదుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించే అవకాశం ఉందని బీసీసీఐ తెలిపింది. అనుమతి లేని వ్యక్తులు కనిపిస్తే సంబంధిత ఆటగాడిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. అవసరమైతే సస్పెండ్ చేసే అవకాశాలు కూడా ఉన్నాయని పేర్కొంది. టీమ్ సభ్యుల గదుల్లోకి ఇతరులను అనుమతించబోమని బీసీసీఐ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. హోటల్ బయటకు వెళ్లే ముందు ఆటగాళ్లు సెక్యూరిటీ లైజన్ అధికారి లేదా టీమ్ ఇంటిగ్రిటీ అధికారికి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. హోటల్ పరిసరాల్లో తిరగాలన్నా టీమ్ మేనేజర్ అనుమతి తప్పనిసరి చేశారు. ఐపీఎల్ అవినీతి నిరోధక మరియు భద్రతా విభాగం సమర్పించిన నివేదికలో డగౌట్లు, బస్సులు, హోటళ్ల వద్ద ఆటతో సంబంధం లేని వ్యక్తులు సంచరిస్తున్నట్లు గుర్తించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే బీసీసీఐ కఠిన నిబంధనలు అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ కూడా అవినీతి నిరోధక విభాగం నివేదిక అందిన విషయాన్ని ధృవీకరించారు. ప్రస్తుతం ఈ అంశం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శుక్రవారం
8 మే 2026



## 'సతీ లీలావతి' ఎలా ఉందంటే?

**హైదరాబాద్, మే 8 :** వివాహం తర్వాత కొంత విరామం తీసుకున్న లావణ్య త్రిపాఠి నటించిన తాజా కుటుంబ కథా చిత్రం 'సతీ లీలావతి' నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. భార్యాభర్తల మధ్య పెరుగుతున్న దూరాలు, అపార్థాలు, భావోద్వేగాల నేపథ్యంలో దర్శకుడు తాతినేని సత్య ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. అయితే ఈ సినిమా ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుందో ఇప్పుడు చూద్దాం. కథ విషయానికి వస్తే.. ప్రముఖ దర్శకురాలు లీలావతి చిన్ననాటి భయాలతో మానసికంగా ఇబ్బంది పడుతూ ఉంటుంది. సైకాలజిస్ట్ రామ్ సేతు సహాయంతో ఆ సమస్యల నుంచి బయటపడిన ఆమె, చివరకు అతడినే ప్రేమించి వివాహం చేసుకుంటుంది. కానీ పెళ్లైన కొన్నేళ్ల తర్వాత సేతు మరో మహిళతో ప్రేమలో ఉన్నానని చెప్పి విడాకులు కోరుతాడు. దీంతో లీలావతి తీసుకున్న నిర్ణయం వారి జీవితాలను ఎలా మార్చింది? చివరకు ఈ దంపతుల బంధం ఏ దిశగా వెళ్లింది? అనేదే సినిమా ప్రధాన కథ. సినిమాలో లావణ్య త్రిపాఠి నటన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. భావోద్వేగ సన్నివేశాల్లో ఆమె నటన సహజంగా అనిపిస్తుంది. భర్తతో సంబంధం దెబ్బతిన్న మహిళ పాత్రలో మంచి అభినయం కనబరిచారు. దేవ్ మోహన్ తన పాత్ర పరిధిలో నటించాడు. నరేష్, పవిత్ర లోకేష్, సప్తగిరి తదితరులు తమ పాత్రలకు న్యాయం చేశారు. దర్శకుడు చెప్పాలనుకున్న అంశం మంచిదే అయినప్పటికీ, కథనంలో కొత్తదనం లేకపోవడం సినిమాకు పెద్ద లోపంగా మారింది. మొదటి భాగం కొంతవరకు ఆసక్తికరంగా సాగినా, రెండో భాగంలో కథ గందరగోళంగా మారుతుంది. అవసరం లేని ట్రాక్స్, బలహీనమైన మలుపులు సినిమాను నెమ్మదింపజేస్తాయి. ముఖ్యంగా హాస్య సన్నివేశాలు ఆశించిన స్థాయిలో పనిచేయలేదు. సాంకేతికంగా చూస్తే సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ అందించిన నేపథ్య సంగీతం సినిమాకు బలం చేకూర్చింది. ఛాయాగ్రహణం కూడా ఆకట్టుకుంటుంది. నిర్మాణ విలువలు బాగున్నాయి.

## జ్యోతి రాయ్ మెరుపులు

**హైదరాబాద్, మే 8 :** బుల్లితెర నటి జ్యోతి రాయ్ మరోసారి తన గ్లామర్ ఫొటో షూట్‌తో సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తోంది. 'గుప్పెడంత మనసు' ధారావాహిక ద్వారా తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ అందాల నటి, ఇప్పుడు వెబ్ సిరీస్‌లు మరియు సినిమాలతో బిజీగా మారింది. నటనతో పాటు తన అందంతోనూ అభిమానులను ఆకట్టుకుంటున్న జ్యోతి రాయ్ తాజా ఫొటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజాగా పూల డిజైన్ గౌనులో జ్యోతి చేసిన ఫొటో షూట్ అభిమానులను కట్టిపడేస్తోంది. సహజమైన అందం, స్టైలిష్ లుక్‌తో ఆమె ఇచ్చిన పోజులు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా చిరునవ్వుతో కనిపించిన ఆమె ఫొటోలకు అభిమానులు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. 'గుప్పెడంత మనసు' ధారావాహికలో రిషి తల్లి జగతి పాత్రలో నటించిన జ్యోతి రాయ్, తన అద్భుత నటనతో ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. వయసుకు మించిన పాత్రలో ఎంతో సహజంగా నటించి ప్రశంసలు అందుకుంది. ప్రస్తుతం ధారావాహికలకు దూరంగా ఉంటూ సినిమాలు, వెబ్ సిరీస్‌లలో ప్రధాన పాత్రలు పోషిస్తోంది. ఇటీవల ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'కిల్లర్' చిత్రం కూడా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఇక తాజా ఫొటో షూట్‌తో మరోసారి అభిమానులను అలరిస్తూ సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్‌గా మారింది.






## ఎన్టీఆర్ న్యూ లుక్ వైరల్..

### మాస్ అవతార్‌లో యంగ్ టైగర్ అదుర్స్

**హైదరాబాద్, మే 8 :** యంగ్ టైగర్ ఎన్టీఆర్‌కు సంబంధించిన కొత్త ఫొటో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టిస్తోంది. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ పంచుకున్న ఈ నలుపు-తెలుపు చిత్రం అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఇందులో ఎన్టీఆర్ పూర్తిగా కొత్త స్టైల్‌లో కనిపించడంతో అభిమానులు ఫిదా అవుతున్నారు. తడిసిన జుట్టు, ట్రిమ్ చేసిన గడ్డం, నోటిలో టూత్‌పిక్‌తో ఎంతో ఇంటెన్స్ మాస్ లుక్‌లో ఎన్టీఆర్ కనిపించాడు. గత చిత్రాలతో పోలిస్తే మరింత సన్నగా, స్టైలిష్‌గా మారిన ఆయన రూపం ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఫొటోను పంచుకున్న తమన్ కూడా ఎన్టీఆర్ స్టైల్‌పై ప్రశంసలు కురిపించినట్లు తెలుస్తోంది. అభిమానులు అయితే ఈ లుక్ చూసి "ఇదే అసలైన మాస్ అవతార్" అంటూ కామెంట్లు చేస్తున్నారు. ముఖ్యంగా ఆయన ఫిజిక్‌లో వచ్చిన మార్పు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇక ఈ కొత్త లుక్ దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కించబోతున్న 'డ్రాగన్' చిత్రం కోసమేనన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రశాంత్ నీల్ సినిమాల్లో హీరోలు పవర్‌ఫుల్, రఫ్ అండ్ రా స్టైల్‌లో కనిపిస్తుంటారు. ఎన్టీఆర్ తాజా రూపం కూడా అదే తరహాలో ఉండటంతో అభిమానులు ఈ అంచనాలు వేస్తున్నారు. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం ఈ ఫొటో సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతోంది. ఎన్టీఆర్ అభిమానులు కొత్త పోస్టర్లు, ఎడిట్లతో నెట్టింట హల్‌చల్ చేస్తున్నారు. ఇక యంగ్ టైగర్ తదుపరి చిత్రం కోసం అభిమానులు మరింత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## 47లోనూ అదే అందం..

### తన డైట్ సీక్రెట్ చెప్పిన భూమిక

హైదరాబాద్, మే 8 : ఒకప్పుడు తెలుగు సినీ పరిశ్రమలో స్టార్ కథానాయికగా వెలుగొందిన భూమిక చావ్లా ఇప్పటికీ అదే అందం, ఫిట్‌నెస్‌తో అభిమానులను ఆకట్టుకుంటోంది. 47 ఏళ్ల వయసులోనూ ఎంతో యంగ్‌గా కనిపిస్తున్న భూమిక తాజాగా తన ఆరోగ్య రహస్యాలను, రోజువారీ జీవనశైలిని అభిమానులతో పంచుకుంది. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె తన డైట్ ప్లాన్, ఫిట్‌నెస్ అలవాట్ల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించింది. 'యువకుడు' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన భూమిక, 'ఖుషీ', 'ఒక్కడు', 'సింహాద్రి', 'వాసు', 'మిస్సమ్మ' వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. పెళ్లి తర్వాత కొంతకాలం సినిమాలకు దూరమైన ఆమె, ఇప్పుడు మళ్లీ కీలక పాత్రలతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తన అందం వెనుక ఎలాంటి ఖరీదైన డైట్‌లు లేదా కఠినమైన నియమాలు లేవని భూమిక తెలిపింది. తాను పూర్తిగా శాఖాహారినని, ఇంట్లో తయారుచేసిన సాధారణ ఆహారానికే ప్రాధాన్యం ఇస్తానని చెప్పింది. ఆహారంలో మసాలాలు చాలా తక్కువగా ఉంటాయని, ఏది తిన్నా మితంగా తినడమే తన ఆరోగ్య రహస్యమని వెల్లడించింది ప్రతిరోజూ యోగా, వాకింగ్ తప్పకుండా చేస్తానని భూమిక చెప్పింది. మానసిక ప్రశాంతత కోసం యోగా ఎంతో ఉపయోగపడుతుందని, శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడానికి స్విమ్మింగ్ కూడా చేస్తానని తెలిపింది. ఎక్కువగా నీరు తాగడం, తాజా పండ్లు తీసుకోవడం తన అలవాటని పేర్కొంది. సరైన నిద్ర కూడా ఆరోగ్యానికి చాలా ముఖ్యమని భూమిక వెల్లడించింది. రాత్రి 10:30 లోపే నిద్రపోవడానికి ప్రయత్నిస్తానని, తగినంత విశ్రాంతి లేకపోతే చిరాకు వస్తుందని చెప్పింది. మనసు ప్రశాంతంగా ఉంటేనే చర్మం కాంతివంతంగా ఉంటుందని ఆమె అభిప్రాయపడింది. ఇక ప్రస్తుతం భూమిక మరోసారి సినిమాల్లో బిజీ అవుతోంది. ఇటీవల తల్లి పాత్రల్లోనూ తన నటనతో ఆకట్టుకుంటున్న ఆమె, మంచి కథలు వస్తే మరిన్ని తెలుగు సినిమాల్లో నటించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది.





## సూర్యపై క్రష్ ఉందన్న లైలా

**హైదరాబాద్, మే 8:** ఒకప్పుడు తెలుగు సినీ పరిశ్రమలో స్టార్ కథానాయికగా ప్రత్యేక గుర్తింపు సంపాదించిన లైలా చాలా కాలం తర్వాత మళ్లీ టాలీవుడ్‌లో సందడి చేస్తున్నారు. తాజాగా ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా తమిళ స్టార్ హీరో సూర్యపై తనకు ఉన్న అభిమానాన్ని సరదాగా వెల్లడించడం అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న లైలా తన సినీ ప్రయాణం, రీఎంట్రీ అనుభవాల గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా హీరో సూర్య గురించి ప్రస్తావిస్తూ.. "నాకు సూర్యపై చాలా పెద్ద క్రష్ ఉండేది. ఆయన నటన, వ్యక్తిత్వం నాకు చాలా ఇష్టం" అంటూ నవ్వుతూ చెప్పారు. ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట చర్చనీయాంశంగా మారాయి. అలాగే చాలా సంవత్సరాల తర్వాత మళ్లీ తెలుగు సినిమాలో నటించడం ఎంతో ఆనందంగా ఉందని లైలా తెలిపారు. ప్రస్తుతం విడుదలైన 'గోదారి గట్టుపైన' చిత్రంలో నటించడం తనకు మంచి అనుభూతినిచ్చిందని చెప్పారు. ముఖ్యంగా గోదావరి ప్రాంతపు సహజ వాతావరణం, కథలోని భావోద్వేగాలు తనను బాగా ఆకట్టుకున్నాయని వెల్లడించారు. తెలుగు ప్రేక్షకుల ప్రేమను ఎప్పటికీ మర్చిపోలేనని లైలా పేర్కొన్నారు. గతంలో తాను నటించిన సినిమాలకు ప్రేక్షకులు చూపిన ఆదరణ వల్లే మళ్లీ నటించాలనే ఆసక్తి కలిగిందని తెలిపారు. మంచి కథలు, బలమైన పాత్రలు వస్తే ఇకపై కూడా తెలుగు సినిమాల్లో కొనసాగుతానని స్పష్టం చేశారు. లైలా రీఎంట్రీపై అభిమానులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు తన అందం, నటనతో ప్రేక్షకులను అలరించిన ఆమె మళ్లీ తెరపై కనిపించడం పాత జ్ఞాపకాలను గుర్తు చేస్తోందని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**